
పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు


పుష్కరిణి చుట్టూ విద్యుద్దీపాల వెలుగులు




విష్వక్సేనుడి ఊరేగింపు

# అమ్మవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

## వైభవంగా లక్ష కుంకుమార్చన ● నేడు ధ్వజారోహణం

**బ్రహ్మోత్సవాల్లో నేడు**
ఉదయం 9- 9.30 గంటలు
ధ్వజారోహణం
మధ్యాహ్నం 12.30 గంటలు
స్నపన తిరుమంజనం
సాయంత్రం 7-9 గంటలు
చిన్నశేష వాహనం

తిరుచానూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారి సన్నిధి ముఖ మండపం వద్ద సర్వసేనాధిపతి విష్వక్సేనుడిని కొలువుదీర్చారు. కంకణభట్టాచార్యులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకొచ్చి పుట్టమన్ను సేకరించారు. మాడవీధుల్లో ఊరేగింపుగా ఆలయంలోని యాగశాలకు తీసుకొచ్చారు. నవపాలికలో పుట్టమన్ను నింపి అందులో నవధాన్యాలు వేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ముత్యపు కవచంలో అమ్మవారి దర్శనం

పద్మావతి అమ్మవారు బుధవారం ముత్యపు కవచంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ వజ్ర, వైఢూర్య, స్వర్ణాభరణాలతో దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవ వేళ మాత్రమే అమ్మవారి మూలవర్లకు ప్రత్యేకంగా తయారు చేయించిన ముత్యపు కవచాన్ని అలంకరిస్తారు.

### నేడు ధ్వజారోహణం

గురువారం ఉదయం 9.30 గంటలకు ధనుర్లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రంగా అర్చకులు ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అమ్మవారితో పాటూ గజచిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొస్తారు. ధ్వజస్తంభంపైకి గజపటాన్ని ఎగురవేయడంతో ధ్వజారోహణం పూర్తవుతుంది. రాత్రికి చిన్న శేష వాహన సేవతో అమ్మవారికి వాహన సేవలు ప్రారంభమవుతాయి.

### అమ్మవారికి లక్ష కుంకుమార్చన

పద్మావతి అమ్మవారికి బుధవారం ఉదయం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖ మండపానికి ఉత్సవర్లను తీసుకొచ్చి సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు ఆగమ శాస్త్రోక్తంగా అమ్మవారి లక్ష్మీ సహస్ర నామాలను లక్షసార్లు జపిస్తూ కుంకుమార్చన చేశారు. బ్రహ్మోత్సవాలకు ముందు రోజు లక్ష కుంకుమార్చన సేవ నిర్వహించడం ఆనవాయితీ.

# నారావారిపల్లెకు సీఎం చంద్రబాబు

● సొంతూరుకు లోకేశ్ రాక ● నేడు రామ్మూర్తి నాయుడి కర్మక్రియలు
● తిరుపతికి చేరుకున్న మంత్రులు అచ్చెన్న, అనగాని, బీసీ జనార్దన్
● నేడు రానున్న మరికొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, నందమూరి కుటుంబీకులు


నారావారిపల్లెకు చేరుకున్న సీఎం చంద్రబాబు

తిరుపతి/చంద్రగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో గురువారం సీఎం చంద్రబాబు తమ్ముడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి లోకేశ్ బుధవారం రాత్రి 7.30 గంటలకు నారావారిపల్లె చేరుకున్నారు. ఇక, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్, లోకేశ్వరి మంగళవారమే నారావారిపల్లె చేరుకోగా.. నందమూరి కుటుంబీకులు వసుంధర, శ్రీమాన్, శ్రీనివాస్ తదితరులు బుధవారం మధ్యాహ్నం వచ్చారు. బాలకృష్ణ సహా పలువురు నందమూరి కుటుంబీకులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులు గురువారం ఉదయం నారావారిపల్లి రానున్నట్టు సమాచారం. కాగా, కర్మక్రియల్లో భాగంగా గురువారం ఉదయం 9.30 గంటలకు చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలసి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపాన వ్యవసాయ బావి వద్దకు చేరుకుంటారు. అక్కడ రామ్మూర్తినాయుడికి కర్మక్రియలు నిర్వహిస్తారు. 10.30 గంటల కల్లా ఇంటికి చేరుకుంటారు. 11 గంటలకు ఇంటి ఎదురుగా ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్‌లో రామ్మూర్తినాయుడు చిత్రపటాన్ని ఉంచి ప్రజాప్రతినిధులు, ప్రజలు నివాళులర్పిస్తారు. అప్పటి వరకు సీఎం చంద్రబాబు అక్కడే గడుపుతారు. భోజనాలు పూర్తయ్యాక ఆయన ఇంటికి వెళతారు. గురువారం రాత్రికి నారావారిపల్లెలోనే ఉంటారా లేదా సాయంత్రమే తిరుగు ప్రయాణమవుతారా అన్నది ఇంకా ఖరారు కాలేదు. పార్టీ వర్గాలు మాత్రం చంద్రబాబు శుక్రవారం ఉదయం తిరుగు ప్రయాణమవుతారని చెబుతున్నాయి.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్

**నారావారిపల్లెలో భారీగా ఏర్పాట్లు**
రామ్మూర్తినాయుడు కర్మక్రియల కోసం నారావారిపల్లెలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత పాతిక వేల మందికి భోజనాలు ఏర్పాటు చేయాలని భావించినా.. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో 15 వేల మందికి సరిపడా భోజనాలు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు.

### 11 మంది మంత్రులు, 45 మంది ఎమ్మెల్యేల రాక

రామ్మూర్తి కర్మక్రియల్లో పాల్గొనేందుకు గురువారం నారావారిపల్లెకు 11 మంది మంత్రులు, సుమారు 45 మంది ఎమ్మెల్యేలు రానున్నట్లు సమాచారం. ఇప్పటికే మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్, అనగాని సత్యప్రసాద్ తిరుపతికి చేరుకున్నారు.

### సీఎం సొంతూరులో భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. గురువారం జరిగే రామ్మూర్తి నాయుడి కర్మక్రియల్లో పాల్గొనేందుకు బుధవారమే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సొంతూరుకు వచ్చారు. ఇక, గురువారం పెద్ద ఎత్తున వీఐపీలురానున్నారు. ఈ క్రమంలో ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం సెక్యూరిటీ బలగాలూ బుధవారం ఉదయం నుంచే గ్రామాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. గ్రామంలోకి వచ్చి.. పోయే వాళ్లు ఎవరనేది పరిశీలిస్తున్నారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, దాదాపు 400 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు. చంద్రబాబు ఇంటి చుట్టూ పారా మిలటరీ బలగాలను నియమించారు. పెద్దకర్మ నిర్వహించే ప్రాంతంలో తనిఖీలు జరిపారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుంచి డాగ్ స్క్వాడ్‌లు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్లు తనిఖీలు చేస్తున్నాయి. భోజనశాల వద్ద అదనపు బలగాలను నియమించారు. సీఎం ఇంటివద్దకు ముఖ్య నేతలు, అనుమతి వున్న వారినే లోపలికి పంపేలా ఆదేశాలు ఇచ్చారు.

# మాజీ మంత్రి అమర్‌కు చేదు అనుభవం

## విమానాశ్రయంలో సీఎంను స్వాగతించేందుకు అనుమతించని సెక్యూరిటీ

## కలెక్టర్ చెప్పినా వినిపించుకోని వైనం

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు బుధవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లిన మాజీ మంత్రి అమరనాథరెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. వెలుపలి గేటు వద్దే ఆయన్ను సీఐఎస్ఎఫ్ అధికారులు ఆపేశారు. తాను మాజీ మంత్రినని, అధికార పార్టీ ఎమ్మెల్యేనని అమర్ చెప్పినా వినిపించుకోలేదు. విమానాశ్రయం లోపల వీఐపీ లాంజ్‌లో నిలుచున్న కలెక్టర్ వెంకటేశ్వర్ గమనించి అక్కడికి చేరుకుని సీఐఎస్ఎఫ్ సిబ్బందికి చెప్పి లోపలకు తీసుకెళ్లారు. టెర్మినల్ నుంచీ ఎయిర్‌పోర్టు రన్‌వే పైకి వెళుతుండగా అక్కడ మళ్లీ భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఆయన ఎమ్మెల్యే అంటూ కలెక్టర్ చెప్పినా అనుమతించలేదు. దీంతోస్వరంపెంచిన కలెక్టర్.. తాను జిల్లా మేజిస్ట్రేట్‌నని, ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి స్వాగతం పలకడానికి రన్‌వేపైకి వెళతారని చెప్పినా సిబ్బంది వినిపించుకోలేదు. సీఎం విమానం ల్యాండయ్యే సమయం సమీపిస్తుండడంతో తనకోసం టెర్మినల్ గేటు వద్ద ఆగిపోయిన కలెక్టర్‌ను రన్‌వేపైకి వెళ్లమని కోరినా అమర్ తాను మౌనంగా విమానాశ్రయం నుంచీ వెలుపలికి వచ్చేశారు. వెంట వచ్చిన అనుచరులు, సహచర నేతల ఎదుట అవమానం జరిగిందంటూ తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలిసింది.

### రన్‌వే పైకి పలువురు ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలకడానికి తిరుపతి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు, వెంకటగిరి, జీడీ నెల్లూరు ఎమ్మెల్యేలతోపాటు డాలర్స్ దివాకర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి తదితర టీడీపీ నాయకులు పలువురు విమానాశ్రయ రన్‌వేపైకి చేరుకున్నారు. ఎమ్మెల్యే అమర్‌ను మాత్రం విమానాశ్రయ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో వున్న వారు సీఎంకు స్వాగతం పలికేందుకు అనుమతి ఇస్తారు. సంబంధిత జాబితా కలెక్టర్ నుంచీ విమానాశ్రయ డైరెక్టర్‌కు వెళితే, ఆయన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి పంపుతారు. జాబితాలోని వ్యక్తులను వారు విమానాశ్రయం లోపలకు, రన్‌వే పైకి అనుమతిస్తారు. కలెక్టర్ కాకుండా సీఎం కార్యాలయం నుంచీ కూడా విడిగా జాబితా వస్తుంది. అందులో పార్టీ ముఖ్యుల పేర్లు ఉంటాయి. ఆ జాబితా కూడా కలెక్టర్ నుంచే విమానాశ్రయానికి వెళుతుంది. వాస్తవానికి ఈ జాబితాతో సంబంధం లేకుండా కూడా ఎమ్మెల్యేలను అనుమతించాల్సి ఉంటుంది. ఇతర ఎమ్మెల్యేలను, పదవులు లేని పార్టీ నేతలను కూడా రన్‌వే పైకి అనుమతించిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది జిల్లాలోనే సీనియర్ ఎమ్మెల్యే అయిన అమరనాథరెడ్డిని అడ్డుకోవడం 'కూటమి'వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### రోజా.. మాట్లాడకుండానే..!



తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని దర్శించుకున్నప్పుడల్లా మాజీ మంత్రి ఆర్కే. రోజా తీవ్రస్థాయిలో చేసే రాజకీయ విమర్శలు వివాదాస్పదమయ్యేవి. అలాంటి ఆమె బుధవారం ఉదయం భిన్నంగా వ్యవహరించారు. ఆలయం నుంచి ఎమ్మెల్సీ కల్యాణితో కలిసి వెలుపలకు వచ్చిన ఆమె.. మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఇటీవల టీటీడీ ధర్మకర్తల మండలి తొలి సమావేశంలోనే తిరుమలలో రాజకీయ ప్రసంగాలు చేయకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని తీర్మానించారు. దీని ప్రభావంతో ఆమె బుధవారం మాట్లాడకుండానే నవ్వుతూ వెళ్లిపోయారు.

# హిజ్రా లీడర్ హాసిని హత్య


● తిరుపతిలో సహచరుల కన్నీటి వీడ్కోలు


హాసిని అంత్యక్రియల్లో పాల్గొన్న హిజ్రాలు, ఇతరులు

తిరుపతి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో దారుణ హత్యకు గురైన హిజ్రా లీడర్ హాసినికి బుధవారం సాయంత్రం తిరుపతిలో సహచరుల కన్నీటి మధ్య అంత్యక్రియలు జరిగాయి. మంగళవారం రాత్రి హత్యకు గురైన మానకల హాసిని మృతదేహాన్ని మంగళంలోని ఆమె నివాసానికి తీసుకొచ్చారు. వందలాదిగా వేచి వున్న హిజ్రాల ఏడుపులతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. 'మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయావా హాసినీ.. ఇక మేమెలా బతకాలి హాసినీ.. మాకెవరు దిక్కు హాసినీ.. మాకందరికి తల్లిలా ఉన్నావు, ఏ కష్టమొచ్చినా ఆదుకునే అక్క వెళ్లిపోయింది' అంటూ కన్నీరుమున్నీరయ్యారు. హాసిని తల్లీ తోబుట్టువు కూడా వచ్చారు. అనేక ప్రాంతాల నుంచి హిజ్రాలు కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలలో తరలివచ్చారు. అంత్యక్రియలు పూర్తయ్యే దాకా పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించారు.

# కల్లోల కడలి

● మూడు రోజులుగా ఆగిన వేట



కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాయుగుండం బలపడి తుపాన్‌గా మారుతుండటంతో కోట మండలంలోని శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం గ్రామాల సమీపంలోని సముద్రం కల్లోలంగా మారింది. అలల ఉధ్రుతి పెరిగింది. బుధవారం ఉదయం నుంచి పలుచోట్ల తేలికపాటి జల్లులు పడగా, చలి పెరిగింది. మూడు రోజులుగా మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకపోవడంతో జీవనోపాధి కోల్పోయారు. మరోవైపు సముద్రంలో బోట్ ఇంజన్ నిలిచిపోయి మంగళవారం సాయంత్రం మత్స్యకారులు చిక్కుకున్నారన్న సమాచారంతో ఇక్కడి మత్స్యకార గ్రామాలు ఆందోళన పడ్డాయి. స్థానికులు ఉన్నారా అని ఆరా తీశాయి. గూడూరు సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు కోట తహసీల్దారు జయజయరావు మంగళవారం అర్ధరాత్రి నుంచి అప్రమత్తమయ్యారు. చివరకు వాళ్లు నెల్లూరు జిల్లాకు చెందిన వారని, బుధవారం ఉదయం వాళ్లను అధికారులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో ఊపిరి పీల్చుకున్నారు.

### పోలీసుశాఖ అప్రమత్తం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యుత్ పరికరాల వద్ద ఉండరాదని, చెట్ల కింద నిలబడకూడదని, కాలువలు, కల్వర్టుల వద్దకు వెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977 నెంబర్లకు ఫోను చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

## బాల్య వివాహాలు నేరం

### న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి పూర్ణిమ దేవి




సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమ దేవి

పాకాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షురాలు పూర్ణిమ దేవి అన్నారు. బాల్ వివాహ్ ముక్త్ భారత్ క్యాంపెయిన్‌లో భాగంగా మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ చదువుకునే వయస్సులో వివాహాలు చేసి పిల్లల భవిష్యత్తు నాశనం చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. యుక్త వయస్సు రాకమునుపే పెళ్లిళ్లు చేసుకుంటే తలెత్తే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ప్రిన్సిపాల్ బేబీశ్వరరెడ్డి, న్యాయవాదులు జి.గురుస్వామినాయుడు, గౌరీశంకర రాజు, ఎస్‌ఎన్‌ఎం సలీం, చంద్రమోహన్, ప్రవీణ్ ప్రకాష్ పాల్గొన్నారు.

## బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, ఎంపీడీవో తదితరులు

తిరుపతి రూరల్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో వెలుగు మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మహిళలు నా కుటుంబం, నా పరిసరాలు, నా గ్రామం, సమాజంలో బాల్యవివాహాలు జరగకుండా చూస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో రామచంద్ర, ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, ఏరియా కో-ఆర్డినేటర్ వనజాక్షి పాల్గొన్నారు.

## రేపు పురందరదాసు ఆరాధన మహోత్సవం

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వాగ్గేయకారుడు, కన్నడ సంగీత పదకవితా పితామహుడు పురందరదాసు ఆరాధన మహోత్సవాన్ని టీటీడీ శుక్రవారం వైభవంగా నిర్వహించనుంది. సహస్రదీపాలంకార సేవ అనంతరం మలయప్పస్వామి, ఉభయ దేవేరులను సాయంత్రం 5.30 గంటలకు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. సంగీత కళాకారుల బృందగానం ఆలకించిన తర్వాత ఉత్సవమూర్తులు తిరిగి 8 గంటలకు ఆలయానికి చేరుకుంటారు. ఈ మహోత్సవం సందర్భంగా టీటీడీ దాసాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి




ఉలవ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

భాకరాపేట, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): రైతులు రబీలో సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట, దీన్‌దార్లపల్లె గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనా, వాతావరణ ఆధారిత బీమా గురించి తెలియజేశారు. వేరుశనగ పంటకు డిసెంబరు 15వ తేదీలోపు ఎకరాకు రూ.450లు చెల్లించాలని, వరికి డిసెంబరు 31వ తేదీలోపు ఎకరాకు రూ.630 చెల్లించి సీఎస్‌సీ సెంటర్‌లో బీమా చేయించుకోవాలన్నారు. సాగులో ఉన్న ఉలవ పంటను పరిశీలించారు.

## శిక్షణతో లక్ష్యాల ఛేదన



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత

రామచంద్రాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శిక్షణతోనే లక్ష్యాలను ఛేదించవచ్చని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఫార్మసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత అన్నారు. మండలంలోని వెంకట్రామాపురం సమీపంలో ఉన్న సెవన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం కళాశాల, అనంతపురం జేఎన్‌టీయూ సంయుక్తంగా ఐదు రోజుల ఫ్యాకల్టీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మూడవ రోజు కార్యక్రమానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఏఐ, బిగ్ డేటా వంటి సాంకేతికతల్లో అత్యవసరంగా శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మద్రాస్ మెడికల్ కళాశాల ఫార్మసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇందుమతి, పలు కళాశాల అధ్యాపకులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జ్యోతి బసిని పాల్గొన్నారు.

## తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు

### - హైదరాబాద్ భక్తులకు స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన కారు

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం ఓ కారు అదుపుతప్పి కొండను ఢీకొంది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనార్థం సొంత కారులో తిరుమలకు బయలుదేరింది. మార్గంలోని ఓ మలుపు వద్ద ముందు వెళుతున్న ఎలక్ట్రిక్ బస్సును అధిగమించే క్రమంలో అదుపుతప్పి కొండను ఢీకొంది. కారులోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఎలక్ట్రిక్ బస్సు తమ కారుకు తగలడంతోనే ప్రమాదం జరిగినట్టు భక్తులు తెలిపారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల కానుక




విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న తులసీరామ్

పాకాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులశెట్టివారిపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం క్రీడాదుస్తులు కానుకగా అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తులసీరామ్ దుస్తులు సమకూర్చారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో నైపుణ్యాన్ని సాధించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు టి.జయరామ నాయుడు, కుప్పస్వామినాయుడు, ఆర్వీ ప్రసాద్, జి.రామయ్య, హెచ్‌ఎం కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు అభినందనలు



కుమారమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి (జీవకోన), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పూరమిట్ల కుమారి (కుమారమ్మ)ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభినందించారు. బుధవారం ఆమె ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే దుశ్శాలువతో సన్మానించి, అభినందనలు తెలిపారు. 49వ డివిజన్ టీడీపీ అధ్యక్షురాలు రాణి, ప్రధాన కార్యదర్శి మురళి, శ్యామల, లలిత, వి.శ్యామల పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

చంద్రగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలో ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్‌కు సీపీఎం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎ.రంగంపేట పంచాయతీ నాగపట్ల రెవెన్యూ లెక్క దాఖలా సర్వేనెంబర్ 80-ఏలో 8.31 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందని, అందులో బోర్డు పెట్టినప్పటికీ యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారని తెలిపారు. దాన్ని కాపాడి, పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. దీనిపై ఆర్డీవో సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, తిరుపతి రూరల్ కార్యదర్శి సుమన్, నాయకులు చిన్నబాబు, యుగంధర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మైదాన గిరిజన ప్రాంతాలపైనా దృష్టి పెట్టండి



చంద్రబాబుకు విన్నవిస్తున్న అక్కులప్ప నాయక్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీతో పాటు మైదాన గిరిజన ప్రాంతాల్లోనూ కేంద్ర ప్రభుత్వ నిధులను వెచ్చించాలని గిరిజన విద్యార్థి సంఘం (టీఎస్ఎఫ్) అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ కోరారు. సీఎం చంద్రబాబును కలిసి బుధవారం ఆయన వినతిపత్రం అందజేశారు. నామినేటెడ్ పదవుల్లో గిరిజనులకు అవకాశం, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, తాండాలను పంచాయతీలుగా గుర్తించడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## కుస్తీ పోటీల్లో పద్మావతి కాలేజీ విజయం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భువనేశ్వరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పద్మావతి జూనియర్ కాలేజీ విద్యార్థినులు కుస్తీ, గట్కా పోటీల్లో గెలుపొందారు. చిత్తూరు జిల్లా యాదమరిలో నిర్వహించిన అంతర జిల్లా పోటీల్లో వీరు విజేతలుగా నిలిచారు. అమృత, వైష్ణవి, శారద ఓవరాల్ ఛాంపియన్‌షిప్ పొందారు. గట్కా పోటీల్లో చందన, పల్లవి, పూజ, తనూజ, మొగధారమ్మ, ప్రసన్న ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ భువనేశ్వరి అభినందించారు. పీడీ సాయిసుమతి పాల్గొన్నారు.

## మధుసూదన్‌కు న్యాయశ్రీ-2024 అవార్డు




అవార్డు అందుకుంటున్న జల్లి మధుసూదన్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బీజేపీ నేత, న్యాయసేవా సంస్థ సౌధాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జల్లి మధుసూదన్‌కు న్యాయశ్రీ - 2024 అవార్డు లభించింది. హైదరాబాద్ రవీంద్రబారతిలో మంగళవారం రాత్రి జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నందా ఆయనకు అవార్డు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన మెగాసిటీ కళావేదిక ఉచితంగా న్యాయ సేవలు అందించే వారికి ఏటా రాజ్యాంగ దినోత్సవం రోజున న్యాయశ్రీ అవార్డు అందించి గౌరవిస్తోంది. జల్లి మధుసూదన్‌ను తెలంగాణ సీనియర్ న్యాయవాదులు, సరస్వతీపుత్రులు దైవజ్ఞశర్మ, ఇతర సీనియర్ న్యాయవాదులు సన్మానించారు.

## త్వరలో అందుబాటులోకి తిరుచానూరు రైల్వేస్టేషన్



డీఆర్‌ఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న రైల్వే యూనియన్ నాయకులు

రేణిగుంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రైల్వేస్టేషన్ త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని గుంతకల్లు రైల్వే డీఆర్‌ఎం విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన స్టేషన్‌ను పరిశీలించారు. సీఆర్ఎస్‌లో తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ సీఆర్ఎస్‌లో వందే భారత్ కోచ్‌ల మరమ్మతుకు అవసరమైన సదుపాయాలు, ఓహెచ్‌సీ(ఓవర్ హెడ్ క్యాంషాఫ్ట్) ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎక్కువ కోచ్‌ల మరమ్మతులు చేపట్టడంపై ఉద్యోగులతో చర్చించినట్లు చెప్పారు. తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైల్వే యూనియన్ నాయకులు ఈ సందర్భంగా డీఆర్‌ఎంకు వినతిపత్రం సమర్పించారు.

## నారావారిపల్లెలో ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సత్యప్రసాద్ తదితరులు

చంద్రగిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో గురువారం జరిగే రామ్మూర్తి నాయుడి కర్మక్రియలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఏర్పాట్లను బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. భోజనాలు, వాహనాల పార్కింగ్‌లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడానికి మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో జర్మన్ టెంట్లు ఏర్పాటు చేశారు.

### పంట పొలాలపై

## మళ్లీ ఏనుగుల దాడులు



ధ్వంసమైన టమోటా పంట
ఏనుగులు విరిచేసిన మామిడి చెట్లు

భాకరాపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి దిగవూరు గ్రామాల నుంచి భాకరాపేట అడవి ప్రాంతం వైపు వచ్చాయి. భాకరాపేట గ్రామానికి చెందిన రాశెట్టి మోహన్ బాబుకు చెందిన టమోటా పంటను నష్టపరిచాయి. బాల్దారు సిద్ధయ్య మామిడి తోటలో చెట్లను విరిచేశాయి. బుధవారం తెల్లవారుజామున వడ్డిపల్లె మీదుగా జంగమాల కొండ రిజర్వ్ ఫారెస్టు వైపు వెళ్లినట్లు సమాచారం.

## ఘనంగా కార్తీక వన భోజనాలు



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులకు భోజనం వడ్డిస్తున్న డిప్యూటీ ఈవో

చంద్రగిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీక వన భోజనాలు ఘనంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. పాలు, పెరుగు, కొబ్బరి నీరు, పసుపు, చందనాలతో అభిషేకం చేసి, స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆస్థానం నిర్వహించారు. రుచికరమైన వంటకాలను భక్తులకు వడ్డించారు. శ్రీవారి వన భోజనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, శేషాద్రిచార్యులు పాల్గొన్నారు.

## భావితరాలకు మంచి చేసేలా బాబు పాలన

### ● మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మంచి చేసేలా సీఎం చంద్రబాబు పరిపాలన సాగుతోందని, ఎన్నో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కోనకళ్ల నారాయణరావుతో కలిసి ఆయన బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అనగాని ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్లు చెప్పారు. గడిచిన 150 రోజుల్లో సీఎం చంద్రబాబు 150 విజయాలను సాధించడంతో పాటు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చారని తెలిపారు. 50 వేల ఉద్యోగ కల్పన కోసం కృషి చేస్తున్నారన్నారు. ఇక, రెవెన్యూ సదస్సు ద్వారా దాదాపు 79,900పైగా సమస్యలు వచ్చాయని, అందులో ఇప్పటికే 40 వేల వరకు పరిష్కరించామని వెల్లడించారు. మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.



రేణిగుంట విమానాశ్రయంలో బుధవారం సాయంత్రం సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ ఈవో శ్యామలరావు తదితరులు

## నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(వైద్యం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ, జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి ఆస్పత్రిలో నర్సింగ్ కేర్‌లో మూడేళ్ల అనుభవం ఉన్న నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలోని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో బుధవారం స్విమ్స్ యూనివర్సిటీ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓమ్ క్యాప్, ఎస్ఎంకేర్ సొల్యూషన్స్ సహకారంతో స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో బీఎస్సీ, జీఎన్ఎం విద్యార్థులకు జర్మన్ భాష, ఉపాధి అవకాశాలపై ఆరు నెలల ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. ఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ మాట్లాడుతూ.. జర్మన్ భాష, ఉద్యోగావకాశాలపై ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వైద్యాధికారులు వనజాక్షి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు రెహానా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ




సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్టోరల్ అబ్జర్వర్ వినయ్ చంద్

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణకు 2025 సంబంధించిన మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణను జాగ్రత్తగా చేపట్టాలని అధికారులను ఎలక్టోరల్ అబ్జర్వర్ వి.వినయ్‌చంద్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లో తిరుపతి, చిత్తూరు కలెక్టర్లు ఎస్.వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్ తదితర అధికారులతో ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితాపై ఆయన సమీక్షించారు. మార్పులు, చేర్పుల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్దేశిత గడువులోపు పూర్తిచేయాలని తెలిపారు. ఓటర్ల నుంచి స్వీకరించిన క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. డెత్, షిఫ్ట్, అబ్సెంట్ వంటి క్లెయిమ్స్ విషయంలో కలెక్టర్లు, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు దృష్టి పెట్టాలన్నారు. 18-19 ఏళ్ల వయసు గల ఓటర్ల నమోదుపై శ్రద్ధ చూపాలన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణను పకడ్బందీగా చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న పోలింగ్‌స్టేషన్లను మార్చాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సాల్ తిరుపతి, నెల్లూరు జిల్లాల మునిసిపల్ కమిషనర్లు మౌర్య, సూర్యతేజ, తిరుపతి, చిత్తూరు డీఆర్వోలు నరసింహులు, మోహనకృష్ణ, మూడు జిల్లాల ఈఆర్‌వోలు, నియోజకవర్గాల ఏఈఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి మంత్రిని కలిసిన వైసీపీ కార్పొరేటర్లు



తిరుపతి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను వైసీపీ కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్‌లో ఉన్న మంత్రిని బుధవారం కలిసి సన్మానించారు. ఇటీవల మంత్రిని కలిసిన వైసీపీ కార్పొరేటర్లలో వీరు లేకపోవడంతో.. కూటమి పార్టీలో చేరేందుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్టు తెలిసింది. వీరితో పాటు టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, శ్రీధర్‌వర్మ ఉన్నారు. నారా రామ్మూర్తినాయుడి కర్మక్రియల అనంతరం పలువురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరనున్నట్టు సమాచారం.

## 30 నుంచి సైక్లింగ్ ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల 30, డిసెంబరు ఒకటో తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్-14, 16, 18, సీనియర్ మెన్ అండ్ ఉమెన్ సైక్లింగ్ ఎంపికపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాకాధికారి సయ్యద్ సాహెబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు సొంత సైకిళ్లు, సామగ్రితో 30న ఉదయం 8గంటలకు హాజరుకావాలనిపేర్కొన్నారు. రాణించిన క్రీడాకారులను వచ్చేనెల 7నుంచి 10వ తేదీ వరకు ఒడిశాలో జరిగే జాతీయస్థాయిపోటీలకు పంపుతామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849379932, 9703092077లలో సంప్రదించాలని కోరారు.

## తిరుమలలో 'ఈ-బస్ స్టేషన్' స్థల పరిశీలన

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో 'ఈ-బస్ స్టేషన్' స్థలాన్ని ఏపీ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు బుధవారం పరిశీలించారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ జగదీష్, తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథ్, ఇంజినీరింగ్ డిప్యూటీ ఈఈ చెన్నకేశవరావుతో కలిసి రింగురోడ్డులోని గ్యాస్‌గోడౌన్ వెనుక స్థలం వద్దకు వెళ్లారు. ఈ-బస్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ నూతన కాంప్లెక్స్‌లో ఛార్జింగ్ స్టేషన్, గ్యారేజ్, బస్టాండ్, కార్యాలయాల వంటి వాటితో పాటు భక్తులకు సౌకర్యాలు, అత్యాధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా తయారు చేసిన ప్లాన్‌ను ఛైర్మన్‌కు చూపించారు.

## పన్నులు చెల్లించకపోతే వాహనాల సీజ్




ధృవపత్రాలను తనిఖీ చేస్తున్న మురళీమోహన్

తిరుపతి (రవాణా), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రవాణా శాఖకు సంబంధించి త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించకపోతే వాహనాలను సీజ్ చేస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. బుధవారం చేపట్టిన తనిఖీల్లో పర్మిట్, ఫిట్‌నెస్, త్రైమాసిక పన్ను చెల్లించకుండా నడుపుతున్న ఓ ప్రైవేటు బస్సును అధికారులు సీజ్ చేశారు. డీటీవో మాట్లాడుతూ కాంట్రాక్ట్ క్యారేజీ వాహనాల బస్సు యజమానులు సంబంధిత వాహనానికి ధృవపత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను దగ్గర ఉంచుకోవాలన్నారు. ధృవపత్రాలు లేకుండా రోడ్లపై వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పరిధిలో నవంబరు మాసంలో ఇప్పటివరకు రూ.1.80 కోట్ల అపరాధ రుసుం (పన్నుల రూపంలో) వసూలు చేసినట్లు తెలిపారు.

## అమ్మవారి ఆలయం వద్ద పుష్పాలంకరణ



ఆలయం వద్ద, ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ

తిరుచానూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయం, ధ్వజస్తంభం, పరిసరాల్లో పుష్పాలంకరణ చేపట్టారు. ఇక, ఫ్రైడే గార్డెన్‌లో టీటీడీ ఆధ్వర్యంలో పలు, ఫల, పుష్ప ప్రదర్శనశాలలను సిద్ధం చేశారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఆహ్లాదం, భక్తిభావాలను పెంపొందించేలా విభిన్న పుష్పాలు, ఔషధ మొక్కలు, పండ్లు, కూరగాయలతో చేసిన దేవతాప్రతిమలు, పురాణఘట్టాలను ఏర్పాటు చేశారు. ఏడాది కర్ణాటక రాష్ట్రం మైసూరుకి చెందిన గౌరీ రూపొందించిన పద్మావతి శ్రీనివాసుడు సైకతశిల్పం విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఫల ప్రదర్శనలో 40వేల సీజనల్ ఫ్లవర్స్, కట్ ఫ్లవర్స్ వినియోగిస్తున్నట్లు టీటీడీ ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. లక్ష్మీవరాహస్వామి, గుండె ఆకారంలో సప్తద్వారాలు ఏర్పాటు చేశారు. ఈ పుష్పాలతో కలశం, ఏనుగు, కలశం, సీతాకోకచిలుక, డాల్ఫిన్, గొడుగు తదితర ఆకృతులను తీర్చిదిద్దారు. 12 పౌరాణిక ఘట్టాలతో సెట్టింగ్స్ వేశారు. ఉద్యానవనంలోని పుష్కరిణిలో కొల్హాపూర్ లక్ష్మీదేవి, అష్టలక్ష్మి సెట్టింగు భక్తులను ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది. దీనితో పాటు ఎస్వీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో వనమూలికల ప్రదర్శన, ఎస్వీ సంప్రదాయ ఆలయ శిల్ప శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కళల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనశాలలను గురువారం ఉదయం ధ్వజారోహణం అనంతరం టీటీడీ అధికారులు ప్రారంభించనున్నారు.

### పంచవేదికలపై కళారాధన

అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టు, శ్రీ వెంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల సంయుక్తాధ్వర్యంలో గురువారం నుంచి తొమ్మిది రోజులపాటూ తిరుచానూరు ఆస్థాన మండపం, శిల్పారామంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య మందిరం, రామచంద్ర పుష్కరిణిలో సంగీత, నాట్య సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

## గంగమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించండి


టీటీడీ ఈవోతో సమావేశమైన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధికి టీటీడీ ఆర్థిక సాయం అందించాలని ఈఓ శ్యామలరావును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గతంలో శ్రీవాణి ట్రస్ట్ నుంచి నిధులు అందించినా సరిపోవడం లేదని వివరించారు. తిరుపతి ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణ్ రెడ్డి, తిరుమల ఏఈఓ చౌదరిలను వెంటనే బదిలీ చేయాలని, ఏళ్ల తరబడి అదే పోస్టుల్లో వారు కొనసాగుతుండటంతో వారి అక్రమాలకు అంతు లేకుండా పోయిందని అన్నారు. బుధవారం సాయంత్రం పద్మావతి రెస్ట్‌హౌస్‌లో ఈఓతో ఎమ్మెల్యే సమావేశమై వినతిపత్రం అందజేశారు. తిరుమల బాలాజీ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల శ్లాబ్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. తాగు నీటి వసతి, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు.

## అన్నమాచార్య ప్రాజెక్ట్‌ను భ్రష్టుపట్టించారు


అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో అన్నమాచార్య ప్రాజెక్ట్‌ను భ్రష్టు పట్టించారని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన అన్నమాచార్య కళామందిరంలో ప్రాజెక్ట్ కళాకారులతో మాట్లాడారు. వారి ఇబ్బందులను, ప్రాజెక్ట్ కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సవ్యంగా సాగున్న ప్రాజెక్ట్‌ను గత పాలకులు గతి తప్పించారన్నారు. వారి నిర్వాకం వల్ల కళాకారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఛైర్మన్, ఈఓతో చర్చించి కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. రాబోయే ధర్మకర్తల మండలి సమావేశంలో సమస్యలను ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు.

## కాలువ నిర్మాణ పనులు ప్రారంభం


పనులు చేస్తున్న సిబ్బంది

తిరుపతి (జీవకోన), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి - కరకంబాడీ రోడ్డులోని సుబ్బారెడ్డినగర్ వద్ద అసంపూర్తిగా ఉన్న కాలువ నిర్మాణ పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. కరకంబాడి రోడ్డులో పెద్దకాలువ నిర్మాణ పనులను గతంలో చేపట్టారు. కొంతభాగం అసంపూర్తిగా వదిలేశారు. స్థానికుల వినతి మేరకు నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య మళ్లీ పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకున్నారు.

## రేపటి నుంచి ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో


మాట్లాడుతున్న కేవీ చౌదరి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో బిజినెస్ ఎక్స్‌పో-24 నిర్వహిస్తున్నట్లు రాయలసీమ జోన్ ఛైర్మన్ కేవీ చౌదరి అన్నారు. బుధవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు సమాచారాన్ని పంచుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినూత్న ఉత్పత్తులు కూడా ప్రదర్శిస్తామన్నారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## టీఎన్‌పాలెం హరిజనవాడలో అమృత్ పథకం


ఇంటింటికీ ఇచ్చిన కొళాయి కనెక్షన్లు

తిరుపతి (జీవకోన), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని తిమ్మినాయుడుపాలెం హరిజనవాడలో అమృత్ పథకాన్ని అమలు చేశారు. ఇంటింటికీ తాగునీటి సదుపాయం కల్పిస్తున్నారు. హరిజనవాడలోని 200 కుటుంబాలకు రక్షిత మంచినీటి పథకాన్ని నగరపాలక సంస్థ అమలు చేస్తోంది. బుధవారం కాలనీలో పైపులైన్ పనులు ముమ్మరంగా చేపట్టారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇస్కాన్ నేత కృష్ణదాస్‌ను విడుదల చేయాలి

తిరుపతి, గాంధీరోడ్డు 27(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ ఇస్కాన్ నేత కృష్ణదాస్‌కి అక్కడి ప్రభుత్వం బెయిల్ మంజూరు చేసి వెంటనే విడుదల చేయాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల కోరారు. బంగ్లాలో హిందువులపై జరిగే హింసాత్మక దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్న కృష్ణదాస్‌ను అరెస్టు చేయాడాన్ని సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అక్కడి హిందువులపై అరాచకాలకు పాల్పడం దారుణమని, దీన్ని మానుకోవాలని హితవు పలికారు. కాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృష్ణదాస్‌ని విడుదల చేయాలని బంగ్లా ప్రభుత్వాన్ని కోరడం పట్ల ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

# తిరుపతి

## ఆస్పత్రి పరిసరాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్యం లోపిస్తే సహించేది లేదని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు పారిశుధ్య ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించారు. ఆస్పత్రిలో లోపించిన పారిశుధ్యానికి సంబంధించి ఆంధ్రజ్యోతిలో రుయా రోగులకు కొత్త రోగాలు శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఆయన అధికారులతో కలిసి ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. పేరుకున్న చెత్త నిల్వలను శుభ్రం చేయించారు. బయో వ్యర్థాలు నిల్వ లేకుండా తీసుకువెళ్లాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు అందక రెండు రోజులుగా సమ్మెలో ఉండటం వలన చెత్త కుప్పలను తొలగించడం కొంత ఇబ్బంది కలిగిందన్నారు. తక్షణమే చర్యలు చేపట్టకపోతే ఉపేక్షించేది లేదని ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించారు.

## వైసీపీ ఎమ్మెల్యేలతో ప్రజాధనం దుర్వినియోగం


మాట్లాడుతున్న బగ్గిడి గోపాల్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు రాకుండా వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని చిత్తూరు జిల్లా పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 11మంది వైసీపీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడేందుకు కూడా సభకు రావడం లేదన్నారు. ప్రజల డబ్బుతో జీతాలు, భద్రత పొందుతున్నారన్నారు. అలాంటి వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ సీఎం చేయనంతగా మాజీ సీఎం జగన్ అధికార దుర్వినియోగం చేశారని తెలిపారు. కుప్పంలో అక్రమ మైనింగ్ చేసిన ఘనత వైసీపీ నాయకులకే దక్కిందన్నారు. రాగానిపల్లె భూముల కుంభకోణంలో ఎవరెవరు ఉన్నారో నిగ్గు తేల్చాలన్నారు.

## డిజిటల్, సైబర్ నేరాలపై జాగ్రత్త అవసరం


సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికతతో మోసం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు ఎస్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కపిల తీర్థం రోడ్డులోని ఎన్‌జీవో సొసైటీ ఫంక్షన్ హాలులో బుధవారం వినియోగదారులకు డిజిటల్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాల గురించి వివరించి, అప్రమత్తంగా లేకుంటే ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు.

## అలిపిరి డిపోను సందర్శించిన ఆర్టీసీ చైర్మన్



తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు బుధవారం మధ్యాహ్నం అలిపిరి డిపోను సందర్శించారు. చార్జింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. డ్రైవర్లు, నిర్వాహకులతో ముఖాముఖీ మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. సమన్వయంతో భక్తులకు సేవలందించాలని సూచించారు. డీపీటీవో జగదీష్, డీఎంలు విశ్వనాథం, బాలాజీ, హరిబాబు, డీఈ చెన్నకేశవులు పాల్గొన్నారు.

## శెట్టిపల్లి రోడ్డుకు అడుగడుగునా ఆటంకాలే!

- తెలుగుగంగ పైపులతో పనులు మరింత ఆలస్యం
- ఏడాదిగా 15శాతం మాత్రమే పూర్తి


మంగళం-శెట్టిపల్లి రోడ్డు


పగిలిపోవడంతో బయటపడేసిన తెలుగుగంగ సిమెంట్ పైపులు


ఎత్తు తక్కువగా ఉన్న కల్వర్టు

తిరుపతి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంగళం-శెట్టిపల్లి రహదారి పనులకు తెలుగుగంగ పైపులతో ఆటంకం కలుగుతోంది. ఏడాది కాలంగా 15 శాతం మాత్రమే పూర్తయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పైపులు, కల్వర్టుల సమస్యలను ఎలా అధిగమించాలో తెలియక ఇంజనీరింగ్ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

### ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు..

తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమల వెళ్లే భక్తులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా నేరుగా అలిపిరి చేరుకునేలా టీటీడీ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా మంగళం-శెట్టిపల్లె రోడ్డు విస్తరణకు సంకల్పించింది. 3 కిలోమీటర్ల పొడవు, 80 అడుగుల వెడల్పుతో నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి రూ.16కోట్లు కేటాయించింది. ఏడాది క్రితం పనులు మొదలయ్యాయి. తొలి దశలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేశారు. అనంతరం అడ్డుగా ఉన్న వృక్షాలను తొలగించారు. 20 అడుగుల పాత రోడ్డును విస్తరించే క్రమంలో భూమి లోపలున్న తెలుగుగంగ పైపులు బయటపడ్డాయి. తగు జాగ్రత్తలు తీసుకుంటూనే ఎర్రమట్టితో కాస్త రోడ్డు ఎత్తు పెంచారు. అడుగడుగునా పైపులు అడ్డుతగులుతూ పగిలిపోతున్నాయి. అదే సమయంలో కల్వర్టులను తొలగించి, నూతనంగా నిర్మించాలా లేక ఉన్న వాటినే విస్తరించాలా అనే దానిపైనా సందిగ్ధత నెలకొంది. దీంతో పనులు ఆగిపోయాయి.

### బలహీనంగా సిమెంట్ పైపులు

రోడ్డుకు పడమరగా 20 ఏళ్ల క్రితం సిమెంట్ పైపులు ఏర్పాటుచేసి తెలుగుగంగ నీటిని దామినేడుకు సరఫరా చేశారు. ప్రస్తుతం కలెక్టరేట్‌కు విస్తరించారు. అవి బలహీనమై తగలగానే పగిలిపోతున్నాయి. యంత్రాలు పనిచేస్తున్నప్పుడు పగిలిపోతున్నాయి. వాటిని మరమ్మతు చేయడం తప్పనిసరవుతోంది. ఇలా అడుగడుగునా పనులకు ఆటంకం కలుగుతుండడంతో ఇంజనీరింగ్ అధికారులు చర్చలు జరిపారు. ఇరువైపులా పైపులైన్లను తొలగించి దూరంగా వేస్తే 80అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టవచ్చునని, దానికి అదనపు నిధులతో పాటు కాలపరిమితి పెంచాల్సి ఉంటుందని నిర్ణయించారు. పైపులపైనే రోడ్డు విస్తరిస్తే భవిష్యత్తులో ఎన్నో ఇబ్బందులు ఏర్పడవచ్చని భావిస్తున్నారు. కాగా, టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలతో రాష్ట్ర విజిలెన్స్ విచారణ కారణంగా ఇదివరకే దాదాపు నాలుగు నెలల పాటు పనులకు బ్రేక్‌పడిన విషయం తెలిసిందే. కావున టీటీడీ ఉన్నతాధికారులు సమగ్రంగా ఆలోచించి ప్రజప్రయోజనాల దృష్ట్యా సులభరీతిలో, త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## త్వరలోనే స్థానికులకు శ్రీవారి దర్శనం

- సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు కూటమి నేతల పాలాభిషేకం


చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

తిరుపతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానికులకు నెలలో మొదటి మంగళవారం శ్రీవారి దర్శనం పునరుద్ధరిస్తూ టీటీడీ పాలకమండలి తీర్మానం చేయడం పట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలకు ఎన్డీఏ కూటమి నేతలు బుధవారం పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నేతృత్వంలో ఎన్టీఆర్ కూడలిలో సంబరాలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కూటమి అధికారంలోకి వచ్చాక స్థానికులకు దర్శనం కల్పిస్తూ పాలకమండలి తొలి సమావేశంలోనే నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు శ్రీవారి దర్శన టికెట్లను ఇష్టారాజ్యంగా అమ్ముకుని స్థానికులకు మొండిచెయ్యి చూపారని ఆరోపించారు. స్థానికులకు దర్శన భాగ్యం కల్పించిన సీఎం, డిప్యూటీ సీఎం, టీటీడీ పాలకమండలి ఛైర్మన్, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయ్ కుమార్, శ్రీధర్ వర్మ, పులుగోరు మురళి, బుల్లెట్ రమణ, మహేష్ యాదవ్, పాతకం వెంకటేష్, బిజి కృష్ణ యాదవ్, సూరా సుధాకర్ రెడ్డి, సుబ్బు యాదవ్, బీజేపీ నాయకులు నవీన్ కుమార్ రెడ్డి, వరప్రసాద్, కార్పొరేటర్లు సీకే రేవతి, కల్పనా యాదవ్, వరికుంట్ల నారాయణ, నరసింహాచారి, జనసేన నేతలు పొలకల మల్లికార్జున్, రాజారెడ్డి, నైనార్ శ్రీనివాస్, పగడాల మురళి, సుభాషిణి, హరిశంకర్, సుధాకర్, సునీల్ చక్రవర్తి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, మునస్వామి పాల్గొన్నారు.

## జీవిత గమనాన్ని నిర్దేశిస్తున్న జీవిత చరిత్రలు

- సాహిత్యవేత్త కిరణ్ ప్రభ


కిరణ్ ప్రభ దంపతులను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రొఫెసర్ రాజేశ్వరమ్మ, గార్లపాటి దామోదర నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవిత చరిత్రలు అనేవి మనిషి జీవిత గమనాన్నే నిర్దేశిస్తున్నాయని కాలిఫోర్నియాకు చెందిన కౌముది ఈ-పత్రిక సంపాదకుడు కిరణ్ ప్రభ అభిప్రాయపడ్డారు. 'జీవితాలను మార్చే జీవిత చరిత్రలు' అనే అంశంపై ఎస్వీయూ సెనేట్ హాల్లో బుధవారం ఆయన ప్రసంగించారు. ఎలాంటి వివాదాస్పద అంశాల జోలికి వెళ్లకుండా 800 మంది జీవిత చరిత్రలను స్వరబద్ధం చేశానని అన్నారు. ఎస్వీయూ తెలుగు విభాగం, విశ్వశ్రీ సాహిత్య సమాఖ్య, ఈతరం కవితా వేదిక, తిరుపతి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో జరిగిన సభకు తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ అధ్యక్షత వహించారు. అవధాని ఆముదాల మురళి స్వాగత వచనాలు పలికారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు చేతుల మీదుగా కిరణ్ ప్రభ, కాంతి కిరణ్ దంపతులను సత్కరించారు. ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, తోట వెంకటేశ్వర్లు, మన్నవ గంగాధరప్రసాద్, ఏనుగు అంకమ నాయుడు, వేమూరి జయరాంప్రసాద్ పాల్గొన్నారు.

## కృష్ణయ్యను తొలగించండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో రిటైర్డు ప్రొఫెసర్ వీఆర్సీ కృష్ణయ్యను విధుల నుంచి వెంటనే తొలగించాలని వివిధ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడును కలిసి లా స్టూడెంట్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, జీవీఎస్, ఏఎల్ఎస్ఏ విద్యార్థి సంఘాలు బుధవారం పట్టుబట్టాయి. సుందర్రాజు (లా స్టూడెంట్ యూనియన్), శివశంకర్‌నాయక్ (జీఎన్ఎస్), అశోక్ (ఎస్ఎఫ్ఐ), మల్లికార్జున (ఎన్ఎస్‌యూఐ) మాట్లాడుతూ రిటైర్డు ప్రొఫెసర్ వీఆర్సీ కృష్ణయ్యను గౌరవ డైరెక్టర్‌గా గతంలో నియమించారని, ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఇంకా పదవిలో కొనసాగించడం సరికాదన్నారు. రిటైర్డు ప్రొఫెసర్లను బాధ్యతల్లో కొనసాగించరాదన్న జీవోను తక్షణం అమలు చేయాలని కోరారు.

## తిరుపతిలో అపోలో ఈ-ఐసీయూ అత్యవసర వైద్య సేవలు ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుపతి(వైద్యం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నిత్యం వేల మంది శ్రీవారి భక్తులు వచ్చి వెళ్లే తిరుపతి వంటి మహానగరంలో అపోలో స్థాయి క్రిటికల్ కేర్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని శ్రీమారుతీ ఆస్పత్రిలో చెన్నై అపోలో సంయుక్త ఆధ్వర్యంలో ఈ-ఐసీయూ క్రిటికల్ కేర్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. చెన్నై అపోలో క్రిటికల్ కేర్ సర్వీసెస్ డైరెక్టర్ రామకృష్ణన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటిసారిగా శ్రీమారుతీ ఆస్పత్రిలో ఈ-ఐసీయూ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇక్కడ చికిత్స పొందే రోగుల ఆరోగ్య పరిస్థితిని నిత్యం చెన్నైలోని అపోలో క్రిటికల్ కేర్ నుంచి ప్రత్యేక సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామన్నారు. శ్రీమారుతీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మారుతీకృష్ణ మాట్లాడుతూ అపోలో వైద్య సేవలపై రోగులకు ఉన్న నమ్మకం వల్లనే అపోలో సహకారంతో 35 పడకలతో ఈ-ఐసీయూ క్రిటికల్ కేర్ వైద్య సేవలను ఇక్కడ అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. కార్యక్రమంలో అపోలో వైద్యులు రవి.పి.మహాజన్, డాక్టర్ రాహుల్ కన్‌దెల్వాల్ పాల్గొన్నారు.

## జీతాలు పెంచాలని ధర్నా



రుయాస్పత్రి ముందు సెక్యూరిటీ సిబ్బంది

తిరుపతి(వైద్యం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సెక్యూరిటీ సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు నిబంధనల మేరకు జీతాలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ, ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు రాధాకృష్ణ, మహేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు రుయాస్పత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, ఎస్వీ వైద్య కళాశాలల ఎదుట వారు బుధవారం సెక్యూరిటీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ సిబ్బందికి నిబంధనల మేరకు రూ.26 వేల వేతనాన్ని చెల్లించాలన్నారు. యూనిఫాం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు ఏజెన్సీ నిర్వాహకులు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఆడుకుంటున్నారన్నారు. కనీసం ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. నాలుగు నెలల జీతాలను తక్షణమే చెల్లించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది సమస్యలపై రుయా సూపరింటెండెంట్ రవిప్రభుకు, పారిశుధ్య కార్మికుల సమస్యలపై ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు.

## నేలకూలిన చెట్టును అలాగే వదిలేశారు


ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పడి ఉన్న చెట్టు

తిరుపతి(గాంధీరోడ్డు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నెలన్నర కిందట కురిసిన భారీ వర్షాలకు(తుపాను) టీటీడీ పరిపాలనా భవనం ఎదురుగా ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీ గోడకు ఆనుకుని ఫుట్‌పాత్‌పై ఉన్న ఓ పెద్ద చెట్టు నేలకూలింది. కళాశాల ప్రహరీ గోడ ధ్వంసం కావడంతోపాటు చెట్టు మొత్తం కాలేజీ ప్రాంగణంలోకి ఒరిగిపోయింది. స్పందించిన కళాశాల యాజమాన్యం అప్పట్లో ఈ విషయాన్ని నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది వచ్చి చెట్టుపై ఉన్న చిన్నపాటి కొమ్మలను మాత్రమే తొలగించి మిగిలిన భాగాన్ని అలాగే వదిలేశారు. దాదాపు 50రోజులుగా చెట్టు ఎండిపోయి అలాగే దర్శనమిస్తోంది. మున్సిపల్ అధికారులు స్పందించి ఇకనైనా తొలగించాలని కోరుతున్నారు.

## విద్యార్థులకు 'స్క్రీనింగ్ టెస్టు'


ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న నర్సులు

తిరుపతి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మంగళంలోని ట్రెండ్స్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్టు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. జిల్లా ఆరోగ్యాధికారి శ్రీహరి, మంగళం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ జయంతి, డాక్టర్ శ్రవంతి ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు రెండు రోజులుగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. విద్యార్థుల కుటుంబ సభ్యులలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరిస్తున్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం(మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్)లు ఎం.ఆర్.పద్మజ, పుష్పలత, సుకన్య, సుబ్బమ్మ, కవిత, ఆశావర్కర్లు ఈశ్వరి, రాజీవ్, వనిత, జగదీశ్వరి, సరస్వతి పాల్గొన్నారు.









# చిత్తమెరిగిన చిత్తానూరమ్మ

## నేటినుంచి తిరుచానూరు బ్రహ్మోత్సవాలు

హరి అంతరంగ అలమేలుమంగ పద్మావతి అమ్మవారికి ప్రీతిపాత్రమైనవి కార్తీక బ్రహ్మోత్సవాలు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల తర్వాత అంత వైభవంగా జరుగుతాయి తిరుచానూరు బ్రహ్మోత్సవాలు. ఏటికేడాది ఈ వేడుకలను టీటీడీ మరింత ఘనంగా నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే దీపకాంతులతో తిరుచానూరు వెలిగిపోతోంది. తిరుపతి నుంచి గరుడవారధి పైనా, కిందా ఏర్పాటు చేసిన దీపతోరణాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. నిజానికి అలిమేలు మంగమ్మకు, తిరుమల శ్రీనివాసుడికి వలే ఏడాది పొడవునా అనేక ఉత్సవాలు జరుగుతుంటాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

పద్మావతిదేవి ఆలయాన్ని తిరుచానూరులో 1820-50 సంవత్సరాల్లో హథీరాంజీ మఠాధిపతులు జీర్ణోద్ధరణ చేసినట్లు చరిత్ర చెబుతోంది. అప్పటినుంచి అమ్మవారి ఆలయంలో నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరాది ఉత్సవాలను ఆలయ వేద పండితులు పాంచరాత్ర ఆగమం ప్రకారం నిర్వహిస్తున్నారు.

### నిత్యోత్సవాలు

ప్రతిరోజూ అలిమేలు మంగతాయారుకు సుప్రభాతం, సహస్రనామార్చన, నిత్యార్చనతోపాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఏకాంతసేవ, కుంకుమార్చన, వేద ఆశీర్వచన సేవలు జరుగుతాయి.

### వారోత్సవాలు

సోమవారం అష్టదళ పాదపద్మారాధన, గురువారం తిరుప్పావడ సేవ, శుక్రవారం మూలవర్లకు అభిషేకం, వస్త్రాలంకరణ సేవ, లక్ష్మీపూజ, ఉద్యానవనంలో ఉత్సవర్లకు అభిషేకం, సహస్ర దీపాలంకరణ సేవ, శనివారం సామవేద పుష్పాంజలి చేపడతారు.

### పక్షోత్సవాలు

ప్రతి ఏకాదశి రోజున ద్వార పాలకులకు కర్పూరబింబిమాస, స్నపన విశేషాలు నిర్వహిస్తారు.

### మన చిత్తానూరు

శుక మహర్షిచే పాంచరాత్ర ఆగమం ప్రకారం అమ్మవారు పూజలందుకున్న తిరుశుకనూరు కాలక్రమంలో తిరుచానూరుగా నామరూపాంతరం చెందింది అంటారు. అలర్మేల్‌మంగై క్షేత్రంగా తిరుచానూరుకు అలిమేలు మంగాపురం అనే మరో పేరుకూడా ఉంది. నేటికీ తిరుచానూరును అలిమేలు మంగాపురంగానే పిలుస్తుంటారు. ఆలర్ అంటే అలలు, మేల్ అంటే పైన మంగై అంటే అమ్మవారు. పద్మావతి అమ్మవారు పద్మసరోవరంలో అలలపై నుంచి బంగారు కమలంలో ఆవిర్భవించారని పండితులు అర్థం చెబుతారు. తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల వారు మాత్రం తరాలుగా చిత్తానూరు అనే అంటూ ఉంటారు.

### కార్తీకోత్సవాలు

కార్తీక మాసపు బ్రహ్మోత్సవాల్లో లక్ష కుంకుమార్చన, పుష్పయాగం నిర్వహిస్తారు. మార్గశిర మాసంలో ధనుర్మాస పూజలు, మాఘమాసంలో త్రైమాసం, శరడులు (తిరుమాంగల్యం), ఫాల్గుణమాసంలో ఫాల్గుణి ఉత్తర ఉత్సవం, చైత్రమాసంలో ఉగాది ఆస్థానం, వసంతోత్సవాలు, జేష్టమాసంలో పద్మసరోవరంలో తెప్పోత్సవాలు, శ్రావణమాసంలో కృష్ణాష్టమి వేడుకలు, వరలక్ష్మీ వ్రతం, భాద్రపదంలో పవిత్రోత్సవాలు, ఆశ్వయుజంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు.

### మాస ఉత్సవాలు

ప్రతినెలా మొదటి బుధవారం అష్టోత్తర శతకలశాభిషేకం, పద్మావతి అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడం పురస్కరించుకుని గజవాహనసేవ, రోహిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామికి అభిషేకం, వీథోత్సవం, అష్టమి తిథిన అమ్మవారి మూలవర్లకు అభిషేకం, ఉత్తరాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి, సమేత సుందరరాజ స్వామివారికి అభిషేకం, ఊంజల్ సేవ, తిరుచ్చి ఉత్సవం, ఆస్థానం జరుగుతాయి.

### యాత్రికులతో కళకళ

ఒకనాటి చిత్తనూరు అలమేలుమంగ ఆలయానికి రెండువేల మంది భక్తులు మాత్రమే వచ్చేవారు. ప్రస్తుతం నిత్యం 30వేల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో పంచమీతీర్థం రోజు సుమారు లక్ష మందికి పైగా పద్మసరోవరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

---

# అందరికీ అమ్మవారి దర్శనం

## బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి ● టీటీడీ ఈవో శ్యామలరావు



అన్నప్రసాదాన్ని పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, అధికారులు

తిరుచానూరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులందరికీ దర్శనం కల్పిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. వాహన సేవలు, ఇతర కార్యక్రమాలను భక్తులు వీక్షించేందుకు వీలుగా తిరుచానూరు పరిసర ప్రాంతాలతోపాటూ పద్మపుష్కరిణికి నాలుగు వైపులా ఈసారి మొత్తం 20 ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశామన్నారు. గురువారం నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. భక్తులకు సైన్ బోర్డులు, రేడియో అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామన్నారు. పంచమీతీర్థం సందర్భంగా డిసెంబరు 5వ తేదీ సాయంత్రం నుంచి భక్తులు వేచి ఉండేందుకు తిరుచానూరు పరిసర ప్రాంతాలైన జడ్పీ హైస్కూల్, పూడి రోడ్డు, నవజీవన్, తిరుచానూరు గేటు వద్ద 4 హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 120 కౌంటర్ల ద్వారా 50 వేలకుపైగా భక్తులకు తాగునీరు, బాదంపాలు, బిస్మిల్లాబాత్, పెరుగుఅన్నం, విజిటబుల్ ఉప్మాతోపాటూ ఈసారి అదనంగా చక్కెర పొంగలి అందిస్తామన్నారు. అన్నం, పప్పు, సాంబారు, రసం, స్వీట్‌తోపాటూ ఈసారి అదనంగా కర్రీని కూడా అన్న ప్రసాద వితరణ చేస్తామన్నారు. అమ్మవారి వాహన సేవలను ఎస్వీబీసీలో హెచ్‌డీ క్వాలిటీతో ప్రత్యక్ష ప్రసారాలతో పాటూ, ఎస్వీబీసీ ఆన్‌లైన్ రేడియో, యూట్యూబ్ ద్వారా కూడా ప్రసారాలు అందిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో టీటీడీ భద్రతా సిబ్బంది, పోలీసులతో కలిపి 460 మంది, పంచమీతీర్థం రోజున 1500 మంది పోలీసులు, 600 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. డిసెంబరు 6న మధ్యాహ్నం 12.15 గంటల మధ్య పద్మ పుష్కరిణిలో పంచమీతీర్థం చక్రస్నానం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, విజీవో సదాలక్ష్మి, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక చైతన్య ప్రతీకలు స్త్రీల స్వీయ చరిత్రలు

● పోపూరి స్మారకోపన్యాసంలో ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



ప్రొఫెసర్ కాత్యాయని విద్మహేను సన్మానిస్తున్న రచయిత్రి ఓల్గా, ప్రొఫెసర్ మధుజ్యోతి, యువశ్రీ, సుభాషిణి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్త్రీలు రాసిన స్వీయ చరిత్రలు సామాజిక చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని కాకతీయ యూనివర్సిటీ తెలుగు రిటైర్డు ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో బుధవారం పోపూరి వెంకటసుబ్బారావు స్మారక ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. తెలుగు సాహిత్య, సామాజిక చరిత్ర స్త్రీల చరిత్రతో ముడిపడి ఉందన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం మొదలు విప్లవ, దళిత, ప్రాంతీయ, మైనారిటీ వాద ఉద్యమాలనూ స్త్రీ దృక్కోణం లేకుండా పరిశీలించలేమని స్పష్టం చేశారు. అయితే, స్త్రీల ప్రతిభ, కృషి, త్యాగం మరుగున పడ్డాయనీ, ఇందుకు నేటికీ సమాజంలోని పురుషాధిపత్య భావజాల ఆధిక్యతే కారణమని అభిప్రాయపడ్డారు. సమాజాన్నీ, సాహిత్యాన్నీ స్త్రీ కోణంలో నుంచీ పరిశోధన చేపట్టవలసిన అవసరం ఉందని సూచించారు. రచయిత్రి ప్రతిమ మాట్లాడుతూ.. విద్యకు దూరంగా నెట్టివేయబడిన స్త్రీలు ఆయా రంగాల్లో ఎదిగి స్వీయ చరిత్రలు రాయడం అంత తేలికైన విషయం కాదని అన్నారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ.. విద్య ద్వారానే స్త్రీ చైతన్యం, స్త్రీల అభివృద్ధి, స్త్రీ సాధికారత సాధ్యమవుతాయని అన్నారు. డీన్ ప్రొఫెసర్ వాణి మాట్లాడుతూ.. తెలుగు విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో విశేష కృషి చేస్తూ ఉందని తెలిపారు. సభాధ్యక్షత వహించిన తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా తన తండ్రి పోపూరి వెంకటసుబ్బారావు స్మారకోపన్యాసం నిర్వహించేందుకు రచయిత్రి ఓల్గా అందిస్తున్న తోడ్పాటును అభినందించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ దొమ్మరాజు యువశ్రీ సభలో ప్రసంగించారు. 'స్త్రీ-సామాజిక భద్రత' అనే అంశంపై నిర్వహించిన కథల పోటీలో విజేతలు వాణిశ్రీ, గీతాంజలి, బాలకృష్ణలకు బహుమతులను అందజేశారు.

# తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న అంతర్ జిల్లా ముఠా అరెస్టు

● 1990 గ్రాములు స్వాధీనం.. మూడు కేసులు నమోదు



తిరుపతిలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్సు, తిరుపతి అర్బన్ ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. వారి నుంచి 1990 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఎక్సైజ్ అర్బన్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర తెలిపిన ప్రకారం.. ఎంఆర్‌పల్లికి చెందిన చింతగుంట చైతన్య గణేష్, అవిలాల శానప్పకాలనీకి చెందిన మంగళకుమార్, అవిలాలలో ఉంటున్న టి.రాంబాబు, ఎస్‌టీవీ నగర్‌కు చెందిన పాల్‌రాజ్, కడప పట్టణం కందిపాలేనికి చెందిన కొయ్య సోమశేఖర్, పుల్లూరుకు చెందిన గోవిందు జ్ఞానేష్, పక్కీర్‌పల్లికి చెందిన ఎన్.సుబ్బరాయుడు ఒక ముఠాగా ఏర్పడ్డారు. కొన్నేళ్లుగా వీరు గంజాయిని కొని తిరుపతికి తీసుకొస్తున్నారు. శివారు ప్రాంతాల్లో స్టాకు పెట్టి వాటిని పొడి చేసి చిన్న, చిన్న పొట్లాలుగా ప్యాక్ చేయిస్తున్నారు. ఇలా ఐదు గ్రాములు, 10 గ్రాములు, 15 గ్రాములు, 25 గ్రాముల పొట్లాల్లో ఉంచి విక్రయిస్తున్నారు. వీరి కోసం ఎక్సైజ్ ఈఎస్, టాస్క్‌ఫోర్సు అధికారులు కొద్ది రోజులుగా నిఘా ఉంచారు. కడప, తిరుపతి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అధికారులకు సమాచారం వచ్చింది. జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లి రెడ్డి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి ఆదేశాల మేరకు ఈఎస్ టాస్క్ టాస్క్‌ఫోర్స్ సీఐ శ్యామ్‌ప్రసాద్, ఎస్ఐ ఎస్.స్వామినాథన్, అర్బన్ సీఐ రామచంద్ర, ఎస్ఐ జయశంకర్, మహేష్, నరసింహ, హరికృష్ణ, సిబ్బంది బృందాలుగా విడిపోయారు. ఎంఆర్‌పల్లి శాంతినగర్ వద్ద విక్రయిస్తున్న ఇద్దరిని, మంగళం వద్ద మరో ఇద్దరిని, తిరుమలరెడ్డినగర్‌లో ఒకరిని అరెస్టు చేశారు. వారి నుంచి 1990 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని మూడు కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామచంద్ర చెప్పారు.



శ్రీవారి సుప్రభాత సేవలో

# నటి జ్యోతిక

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ నటి జ్యోతిక బుధవారం దర్శించుకున్నారు. వేకువజాము సుప్రభాతసేవలో ఆమె పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది ఆమెకు ప్రత్యేక దర్శనంతో పాటు లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు జ్యోతికను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

## శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించింది. రూ.3.53 కోట్లు లభించినట్లు బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 64,525 మంది శ్రీవారిని దర్శించుకోగా, 19,880 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీకాళహస్తిలో తమిళ హాస్య నటుడు

# యోగిబాబు



శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం తమిళ హాస్య నటుడు యోగిబాబు దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# హైదరాబాదు నుంచి శబరిమలైకి రేణిగుంట మీదుగా 18 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు27(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు, కాచిగూడ నుంచి కొట్టాయం వరకు డిసెంబరు 3 నుంచి రేణిగుంట మీదుగా 18 ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులో ఈ ప్రత్యేక రైళ్ళు(07135) డిసెంబరు3, నుంచి 10,17, 24, 31తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి బేగంపేట, వికారాబాదు, తాండూరు, రాయచూర్, గుంతకల్లు, రాజంపేట, రేణిగుంట,కాట్పాడి, కోయంబత్తూరు, పాల్‌కాడ్, ఎర్నాకులంటౌన్ మీదుగా మరుసటి రోజు 4.10 గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. ఈ ప్రత్యేక రైళ్ళు (07136) డిసెంబరు 4 నుంచి (ప్రతి గురువారం) 11, 18, 25, జనవరి ఒకటవ తేదీల్లో రాత్రి 11.45 గంటలకు కొట్టాయంలో బయలు దేరి వచ్చిన మార్గంలోనే మరుసటి రోజు హైదరాబాదుకు చేరుకుంటాయి.

● కాచిగూడలో ఈ ప్రత్యేక రైళ్ళు(07133) వచ్చే నెల 5, 12, 19, 26 తేదీల్లో( ప్రతి గురువారం) మధ్యాహ్నం 3.40 గంటలకు బయలుదేరి షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, కర్నూలు సిటీ, రాజంపేట, రేణిగుంట,కాట్పాడి, అలువ, ఎర్నాకులంటౌన్ మీదుగా మరుసటి రోజు సాయంత్రం 6.50గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. కొట్టాయంలో ఈ ప్రత్యేక రైలు(07134) డిసెంబరు 6, 13, 20, 27 తేదీల్లో రాత్రి 8.30 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో మరుసటి రోజు రాత్రి 11.40 గంటలకు కాచిగూడకు చేరుకుంటాయి.

### పలు ప్రత్యేక రైళ్లు పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి అకోల, పూర్ణా, సికింద్రాబాదు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను డిసెంబరు 6 నుంచి 30వ తేదీవరకు రాకపోకలు సాగిస్తాయని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

● తిరుపతి-అకోల మధ్య నడిచే ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం తిరుపతిలో.. ప్రతి ఆదివారం అకోలలో బయలుదేరుతుంది.

● పూర్ణా- తిరుపతి మధ్య నడిచేరైలు పూర్ణాలో ప్రతి సోమవారం బయలు దేరుతుంది. ఇదే రైలు తిరుపతిలో ఈ రైలు ప్రతి మంగళవారం బయలుదేరుతుంది.

● తిరుపతి-సికింద్రాబాదు మధ్య నడిచే రైలు, తిరుపతిలో ప్రతి ఆదివారం బయలుదేరుతుంది. ఇదే రైలు సికింద్రాబాదులో ప్రతి సోమవారం బయలుదేరుతుంది.

### కదిరిదేవరపల్లి- గుంతకల్ మధ్య ప్యాసింజరు రద్దు

తిరుపతి- కదిరిదేవరపల్లి మధ్య రోజువారీగా రాకపోకలు సాగిస్తున్న ప్యాసింజరు రైలు డిసెంబరు ఒకటి నుంచి 31వ తేదివరకు కదిరిదేవరపల్లి-గుంతకల్ మధ్య తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# విద్యుదాఘాతంతో రైతు మృతి





పొలంలో రమణయ్య మృతదేహం - రమణయ్య(ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.... గ్రామానికి చెందిన ఇలకా రమణయ్య(58) బుధవారం ట్రాక్టర్‌కు కేజీ వీల్స్ తగిలించుకుని పొలంలో అదును దున్నుతున్నాడు. ఈ సమయంలో విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటర్‌కు సరఫరా చేసే తీగలు ట్రాక్టర్ సైలెన్సర్‌కు తగిలాయి. దీంతో షాక్‌కు గురైన రమణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బిగ్‌బాస్ ఫేం ప్రియాంకపై చర్యలు తీసుకోండి

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఆదరణ పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో భక్తులను భయాందోళనకు గురిచేసేలా 'తిరుపతి దారిలో మాపై చిరుతపులి ఎటాక్ చేసింది' అంటూ ప్రాంక్ వీడియో చేసిన బిగ్‌బాస్ ఫేం ప్రియాంక, ఆమె స్నేహితుడు శివపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీటీడీ సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ఈ మేరకు ఆయన తిరుమల డీఎస్పీకి లేఖ రాశారు. కొద్దిరోజుల క్రితం ప్రియాంక, శివ అలిపిరి కాలినడకమార్గంలో చేసిన ఈ వీడియోపై ఆయన స్పందిస్తూ ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలన్నారు. ఇదే అంశంపై ఇప్పటికే టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కూడా స్పందించిన విషయం తెలిసిందే. టీటీడీ విజిలెన్స్ నుంచి ఫిర్యాదు అందిన తర్వాత కేసు నమోదు చేయాలని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. ఈప్రాంక్ వీడియోపై ఇప్పటికే వార్తలు రావడంతో సోషల్ మీడియా ఖాతాల నుంచి డిలీట్ చేసినట్టు తెలుస్తోంది.

# పుత్తూరు వార్తలు

## టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన


గుర్తింపు కార్డులను చూపుతున్న కార్యకర్తలు

పుత్తూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుకు పుత్తూరు పట్టణంలో విశేష స్పందన లభిస్తోంది. బుధవారం 22వ వార్డు ఆరేటమ్మ కాలనీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రూ.100 సభ్యత్వ నమోదు రుసుంతో రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు పేర్కొన్నారు. సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. రెండు సంవత్సరాల పాటు ప్రమాద బీమాతో పాటు పేద కార్యకర్తల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవనాయుడు, బూత్ ఇన్‌చార్జి కన్నన్, తడుకు సర్పంచు బొబ్బిలి యాదవ్, కరుణా యాదవ్, గాలి గోపినాథ్, ఈశ్వర్ యాదవ్, సుబ్రమణ్యం, పద్మ, కళావతి, జమున తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరులో ఎమ్మెల్యే పర్యటన


టెక్స్‌టైల్స్ దుకాణం నుంచి వెలుపలికి వస్తున్న భానుప్రకాష్ తదితరులు

పుత్తూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పుత్తూరులో పర్యటించారు. బుధవారం స్థానికంగా ఓ రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం రెండు రోజుల క్రితం షార్ట్‌సర్క్యూట్‌కు గురైన ఎస్వీ టెక్స్‌టైల్స్‌ను పరిశీలించారు. ఈ ప్రమాద కారణాలను, నష్టాన్ని దుకాణ యజమాని వెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అక్కడ నుంచి టీడీపీ నాయకుడు బాబు తండ్రి ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఆయన ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## విద్యార్థినుల పట్ల సంస్కారవంతంగా మెలగండి



సదస్సులో ప్రసంగిస్తున్న సీఐ సురేంద్రనాయుడు

పుత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో సహ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, యాసిడ్ దాడులకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని పుత్తూరు అర్బన్ సీఐ సురేంద్రనాయుడు హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 'సామాజిక మాధ్యమం దుర్వినియోగం- సైబర్ బెదిరింపులతో నేరాలు- విద్యార్థులపై ప్రభావం' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలలో ఫొటోలు పెడితే మార్ఫింగ్ చేసి డబ్బు డిమాండ్ చేస్తారని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగే కొద్దీ ప్రమాదాలు పొంచి ఉంటాయని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. సైబర్ నేరాలపై సైబర్ సెక్యూరిటీ బృందం వీడియో ద్వారా అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నారాయణవనం ఓవర్ బ్రిడ్జిపై రాకపోకలు


ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న లారీ

పుత్తూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చెన్నై-తిరుపతి జాతీయ రహదారిలోని నారాయణవనం బైపాస్ వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీద రాకపోకలను అనధికారికంగా అనుమతించారు. దీంతో 15 ఏళ్లుగా అసంపూర్ణంగా వున్న బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో చెన్నై - తిరుపతి మధ్య తిరిగే వాహనాలు నేరుగా వెళ్లడంతో పుత్తూరు పట్టణంలో పాక్షికంగా ట్రాఫిక్ రద్దీ సమస్య తగ్గింది. అయితే నాగలాపురం మీదుగా చెన్నై వెళ్లే వాహనాలు, పుత్తూరు లోకి వచ్చే వాహనాలు మాత్రం బ్రిడ్జి కింద దారి రావలసి వుంది. ఇక పుత్తూరు నుంచి నగరి, తమిళనాడు సరిహద్దు వరకు నాలుగు లేన్ల రహదారి ఇంకా నిర్మాణంలో వుంది. ఈ జాతీయ రహదారికి ఇటీవలే కేంద్రప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. దీంతో ఈ రహదారిలో వడమాలపేట, గాజులమండ్యం వద్ద అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాలను ఇప్పుడిప్పుడే చేపట్టారు. అయితే నిర్మాణాలు పూర్తికాకపోయినా కాంట్రాక్టర్ మాత్రం టోల్ ఫీజును గత 15 ఏళ్లుగా వసూలు చేస్తున్నట్టు విమర్శలున్నాయి.

## నేడు అయ్యప్ప ఆలయంలో లఘు లక్ష బిల్వార్చన

పుత్తూరు టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేవీఎస్ రోడ్డులో ఉన్న కామాక్షి దేవి సమేత సదాశివేశ్వర ఆలయంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 28న 48వ లఘు లక్ష బిల్వార్చన జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 4.30-5.30 గంటల మధ్య గణపతి పూజ, లక్ష్మీగణపతి హోమం, ఉదయం 5.30 గంటలకు అయ్యప్ప స్వామికి అభిషేకం, 6.30 గంటలకు మహాభిషేకం, 9 గంటలకు కలశస్థాపన లక్షా బిల్వార్చన ప్రారంభం అవుతుందని తెలిపారు.

## బాల్య వివాహాల నిర్మూలన

వడమాలపేట, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని, నేరమని, చేసినా సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటారని వక్తలు చెప్పారు. బుధవారం ఎస్‌బీఆర్‌పురం ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు.

## పంట బీమా చేసుకోండి

వడమాలపేట, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి):రబీలో వరి, వేరుశనగ సాగు చేస్తున్నరైతులు గడువులోగా బీమా చేయించాలని ఏవో విజయ్‌కుమార్ చెప్పారు. వడమాలపేట రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోందిలో ఆయన మాట్లాడుతూ.. ఏకరా వరికి రూ.630ను డిసెంబర్ నెలాఖరులోగా, వేరుశనగ ఏకరాకు రూ.450ను డిసెంబరు 15లోగా చెల్లించాలన్నారు. 2024 అక్టోబర్ నుంచి పంట రుణాలు తీసుకున్న రైతులు సంబంధిత పత్రాలు అందించి బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

## ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఉపయోగించుకోండి



వడమాలపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఉపయోగించుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. పత్తి పుత్తూరులో ప్రత్యేక కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈనెల 28, 29 తేదీల్లో అప్పలాయగుంట పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక ఆధార్ కేంద్రం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# గూడూరు
### సూళ్లూరుపేట/వెంకటగిరి

## మోటరు సైకిల్‌ను ఢీకొన్న లారీ
### ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద్ద మోటరు సైకిల్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోహిత్, ఒడిశాలోని బిస్సార్‌కు చెందిన రామిరెడ్డి పెళ్లకూరు మండలంలోని రోసనూరు గ్రామంలో నిర్మిస్తున్న ఓ పరిశ్రమలో పనిచేస్తున్నారు. బుధవారం విధులు ముగించుకుని మోటరు సైకిల్‌పై నాయుడుపేటకు బయలుదేరారు. నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహిత్‌కు చెయ్యి తెగిపోగా, రామిరెడ్డికి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చెయ్యి తెగిపోయిన మోహిత్‌కు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

## ధరల్లేక నిమ్మ రైతు కుదేలు


గూడూరు మార్కెట్‌లో నిమ్మ కాయల బస్తాలు

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిమ్మ కాయలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు కుదేలైపోతున్నారు. గత నెల రోజులుగా నిమ్మకాయల ధరల్లో నిలకడ లేక క్రమేపీ తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన పెరిగిపోతోంది. గడిచిన కార్తీక మాసం సీజన్‌లో కిలో నిమ్మ కాయలు రూ.80 నుంచి రూ.100 వరకు, టిక్కీ (50కిలోల బస్తా) బస్తా రూ.4000 నుంచి రూ.5000 తక్కువ కాకుండా అమ్ముడయ్యాయి. ప్రస్తుతం కిలో రూ.25 నుంచి రూ.40 కంటే ధర లభించకపోవడంతో ఉస్సూరుమంటున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మార్కెట్‌కు తీసుకెళ్లే ఖర్చులు పోనూ కనీస ధర కూడా చేతికందడం లేదని వాపోతున్నారు. తిరుపతి, నెల్లూరు, కడప జిల్లాలో దిగుబడులు పెరగడంతో గూడూరు నిమ్మ మార్కెట్‌కు అంచనాకు మించి నిమ్మకాయలు చేరుకుంటున్నాయి. దీనికి తగ్గట్టుగా డిమాండ్ లేకపోవడంతో ధరలు పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మొన్నటిదాక రికార్డుస్థాయి ధరలు ఉన్నా, తోటల్లో కాయలు లేవని, ప్రస్తుతం కాయలు ఎక్కువ కావడంతో ధరలు లేక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత కూలీలు, రవాణాచార్జీలు, కొట్టు యజమానుల కమీషన్లు పోను టిక్కీ బస్తాకు రూ.1000 కూడా మిగలడంలేదని వాపోతున్నారు.

**తైవాన్ నిమ్మరకం ధరలు దారుణం**

తిరుపతి, నెల్లూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా సాగు ప్రారంభించిన తైవాన్ నిమ్మ రకానికి కనీస ధర కూడా లభించడంలేదు. తిరుపతి జిల్లాలో దక్కలి, నెల్లూరులో సైదాపురం, మనుబోలు, పొదలకూరు మండలాల్లో తైవాన్ రకం నిమ్మ సాగులో ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో తైవాన్ రకానికి కిలో కాయలు రూ.20 నుంచి రూ.25 మించి ధర లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

## డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో 29న జాబ్‌మేళా

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈనెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం బుధవారం తెలిపారు. బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 5వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ డిప్లమోలో ఉత్తర్ణులైన వారు అర్హులన్నారు. వివరాలకు 8639835953 నంబరును సంప్రదించాలన్నారు.

## 30న సామూహిక కార్తీక పూజ

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయ దుర్గాదేవి అమ్మవారి ఉపపీఠంలో ఈనెల 30వ తేదీన అమావాస్య సందర్భంగా సామూహిక కార్తీక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ బుధవారం తెలిపారు. 30వ తేదీ సాయంత్రం 4:30గంటలకు స్థానిక సాయిసత్సంగ నిలయంలో కార్తీక అమావాస్యను పురస్కరించుకుని విజయ దుర్గాదేవి అమ్మవారి నక్షత్ర నవగ్రహపూర్వక అధిదేవత, ప్రత్యధి దేవతా సహిత మహానవావరణ హోమం నిర్వహించబడుతాయన్నారు. అనంతరం భవానీ, శంకరస్వామికి భస్మాభిషేక సహిత ఏకవార రుద్రాభిషేక పూర్వక సామూహిక కార్తీక దీపారాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులు గురువారం సాయిసత్సంగ నిలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి

చిల్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది నిర్వహించే కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా పొందుపరచాలని డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో చిల్లకూరు, చెన్నూరు, గూడూరు అర్బన్ పీహెచ్‌సీల వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సినేషన్, వైద్య పరీక్షలు వంటి కార్యక్రమాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉన్నా ఆన్‌లైన్‌లో ఎలా పొందుపరచాలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. వందశాతం ఆన్‌లైన్ ఆరోగ్య కార్యక్రమాలను పొందుపరచాలని, లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్యసేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నాగేంద్రకుమార్, ప్రకష్, ఆయా పీహెచ్‌సీల వైద్యులు, సీహెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసులు

## కూలిపోయే స్థితిలో తుఫాన్ షెల్టర్


శిథిలావస్థకు చేరిన తుఫాన్ షెల్టర్

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కొత్తపట్నం పంచాయతీ గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలోని తుఫాన్ షెల్టర్ కూలిపోయే స్థితిలో ఉంది. ప్రకృతి విపత్తుల సమయంలో దాదాపు 450 మత్స్యకార కుటుంబాలు ఇక్కడి తుఫాన్ షెల్టరులో తలదాచుకుంటాయి. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ తుఫాన్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకొంది. పైకప్పు పెచ్చులూడి పడుతూ కూలిపోయే స్థితిలో ఉండటంతో అక్కడికి వెళ్లేందకు మత్స్యకారులు భయపడుతున్నారు. ప్రస్తుతం తుఫాన్ ప్రభావంతో సముద్రం ఉరకలేస్తూ పరవళ్లు తొక్కుతుండటంతో తలదాచుకునేందుకు చోటు దొరక్క మత్స్యకారులు బిక్కుబిక్కుమంటున్నారు.

## జీఎస్టీ చెల్లింపులపై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్

సూళ్లూరుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం జీఎస్టీ చెల్లింపుల విధానంపై జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ నెంబర్‌కు ఆధార్ లింకింగ్, అమ్మకాలకు సంబంధించిన బిల్లులను రెడీ చేయడం తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ షబీనా, సిబ్బంది ప్రియదర్శిని, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

## హెచ్ఐవీపై అవగాహన

సూళ్లూరుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ హెచ్ఐవీ అంటువ్యాధి కాదని, బాధితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. వారినీ అందరిలాగానే ఆదరించాలని సూచించారు. హెచ్ఐవీ నిర్మూలనకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతకు పరామర్శ

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని దాదా రాయిగుంట వద్ద నివాసం ఉంటున్న టీడీపీ మైనార్టీ సెల్ సీనియర్ నాయకుడు షేక్ నౌషాద్‌ను పలువురు టీడీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. ఇటీవల నౌషాద్ తల్లి, కోట మాజీ ఎంపీటీసీ గౌసి నిషాబేగం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు షేక్ జలీల్ అహ్మద్, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి జగదీష్‌రెడ్డి, తీగల సురేష్ బాబు, ఎంపీటీసీలు దారాసురేష్, షంషుద్దీన్, వాకా భాస్కర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పరామర్శించారు.


నౌషాద్‌ను పరామర్శిస్తున్న జగదీష్‌రెడ్డి, టీడీపీ నేతలు

## నేత్రదానం

సూళ్లూరుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 446కి చేరింది. బుధవారం రైల్వేస్టేషన్ రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న గంగరాజు లక్ష్మయ్య (80) మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయకు లక్ష్మయ్య నేత్రాలను దానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, సభ్యులు ఆలపాటి అశోక్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


గంగరాజు లక్ష్మయ్య (ఫైల్‌ఫొటో)

## అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం



గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీలే అవుట్‌లో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అన్నదానం జరిగింది. ఉదయం స్వామివారికి పంచామృతం, పాలు, పండ్లుతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామివారికి పడిపూజ నిర్వహించారు. అయ్యప్పభక్తులు భక్తీగీతాలు ఆలపించి, భజనలు చేశారు.

## వాహనం ఢీకొని యువకుడి మృతి

చిల్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడివేడు గ్రామ సమీపంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కడివేడు గ్రామానికి చెందిన మాధవ్(22) నరేష్, రమేష్ బైక్‌పై గూడూరు నుంచి కడివేడుకు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మాధవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్‌కు తీవ్ర గాయాలు కాగా, రమేష్ స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సాగులో మెలకువలు పాటించాలి

ఓజిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏవో విజయలక్ష్మి అన్నారు. ఓజిలి మండలం వెంకటరెడ్డిపాళెం, కొండవల్లపాడు గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విత్తన ఎంపిక, శుద్ధి మొదలుకొని పంట చేతికి వచ్చే వరకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## జింక్‌లోప నివారణతో అధిక దిగుబడి

నాయుడుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరిలో జింక్‌లోపం నివారణతో అధిక దిగుబడి పొందవచ్చని నాయుడుపేట వ్యవసాయశాఖ అధికారి గణేష్ అన్నారు. మండలంలోని అన్నమేడు, వద్దిగుంటకండ్రిగ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ యమదిన్నెపాళెంలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు అగ్నికి ఆహుతైంది. స్థానికుల కథనం మేరకు.... యమదిన్నెపాళెం ఎస్టీకాలనీకి చెందిన ఈటిపాకల రమేష్ దంపతులు ఇంటికి తాళం వేసుకొని కూలి పనులకు వెళ్లారు. ఇంట్లోని విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్‌కు గురై మంటలు ఎగిసి పూరిల్లు కాలిపోయింది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా పూరిల్లు పూర్తి కాలి బూడిదైంది.

## పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో పొణకా మల్లికార్జునరెడ్డి సహకారంతో నిరుపేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రవి, రాము, ప్రభాకర్, పెంచలయ్య, నాగరాజు, మల్లికార్జున్, కృష్ణారెడ్డి, మునిప్రసాద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పంట తొక్కించడంపై రైతుల ఆగ్రహం

దొరవారిసత్రం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వెదురుపట్టు పంచాయతీలోని నర్సమాంబపుర అగ్రహారంలో పచ్చని పంట పొలాలను తొక్కించడంపై సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి సమక్షంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆర్డీవో దొరవారిసత్రం తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. అదే సమయంలో చెరువులో ఆక్రమణలపై ఫిర్యాదు చేసిన తుంగమడుగు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మనోహర్‌రెడ్డి అక్కడే ఉండటంతో ఆయనపై ఆర్డీవో సమక్షంలోనే రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చని పంట తొక్కిచడం ఎంతవరకు సబబుని వెదురుపట్టు సర్పంచు మధురెడ్డి అధికారులను ప్రశ్నించారు. 50 ఏళ్లుగా సాగు చేసుకొంటుండగా, రాజకీయ విభేదాలతో రైతుల కడుపుకొట్టడం మంచి పద్ధతి కాదన్నారు. చెరువులో ఆక్రమణ నేరమని, పంట తొలగింపు అంతా చట్ట ప్రకారమే జరిగిందని ఆర్డీవో చెప్పారు. సర్వే నెంబరు 44లో 9.20 ఎకరాలు, 43లో 7.50 ఎకరాలు, 35లో 5.70 ఎకరాలు చెరువు పోరంబోకు భూములు ఆక్రమణలో ఉండగా వాటిని కూడా తొలగించినట్లు తహసీల్దారు శైలాకుమారి తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే నెలవల జన్మదిన వేడుకలు


నెలవలకు కేక్ తినిపిస్తున్న సంచి కృష్ణయ్య

సూళ్లూరుపేట, పెళ్లకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సూళ్లూరుపేటలోని శేష సాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులతో కలిసి నెలవల కేక్ కట్ చేశారు. సుబ్రహ్మణ్యం పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తిరుమూరు సుధాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, అలవల శ్రీనివాసులు, కామిరెడ్డి మురళీ రెడ్డి, శెల్వం తదితరులు పాల్గొన్నారు. అలాగే పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, పాలచ్చూరు నరేంద్ర యాదవ్, మదన్‌మోహన్ నాయుడు, మురళీ నాయుడు, పరుశురాం తదితరులు నెలవలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి తినిపించారు.

## తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు చంద్రశేఖర్

గూడూరు అర్బన్, నాయుడుపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలు, ఆరోగ్య పరిస్థితులను తల్లిదండ్రులకు వివరించేందుకు డిసెంబరు 7వ తేదీన నిర్వహించనున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలని గూడూరు తహసీల్దారు చంద్రశేఖర్ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయులు, వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 7వ తేదీన నిర్వహించ నున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో విద్యార్థుల సామర్థ్యాలు, ఆరోగ్య సంబంధిత వివరాలను ద్వారా తల్లిదండ్రులకు అందజేసేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మధుసూదన్‌రావు, ఎంఈవో సనత్‌కుమార్ పాల్గొన్నారు. ● నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంపై ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య సుస్థిర సంబంధాలను బలోపేతం చేయడమే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఉద్దేశమని ఎంపీడీవో చెప్పారు. తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవో మునిరత్నం, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి అభిషేక ఆరాధన మహోత్సవం

నాయుడుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుదూరులో వెలసిన హనుమదీశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం అయ్యప్పస్వామి అభిషేక ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతిహోమం, అభిషేకాలు చేశారు. అనంతరం అయ్యప్పస్వామి కీర్తనలతో అభిషేక ఆరాధన మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తబృందం పాల్గొంది.


అయ్యప్పస్వామి కీర్తనలతో పూజలు చేస్తున్న భక్తులు

## వేదోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చన



శ్రీకాళహస్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో లక్ష బిల్వ, కుంకుమార్చనలను బుధవారం వేదోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయ అలంకార మండపంలో ఈ కార్యక్రమాన్ని రుత్వికులు ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు అర్చనను సాగించారు. అనంతరం తిరిగి సాయంత్రం నాల్గో కాలం అర్చన చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అభిషేక గురుకుల్ రాజేష్ గురుకుల్, వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిరుచానూరు రైల్వేస్టేషన్ పరిశీలన



డీఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

రేణిగుంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవానికి సంబంధించి గుంతకల్లు రైల్వే డీఆర్ఎం విజయ్ కుమార్ బుధవారం పరిశీలించారు. అలాగే సీఆర్ఎస్‌ను కూడా పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొత్తగా తిరుచానూరు రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఆ పనులను చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే ఈ స్టేషన్ ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అలాగే సీఆర్ఎస్‌లో వందేభారత్ కోచ్‌లను మరమ్మతులు చేయడానికి అవసరమైన సదుపాయాలతోపాటు ఇక్కడ ఓహెచ్‌సీ(ఓవర్ హెడ్ క్యాంషాఫ్) ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎక్కువ సంఖ్యలో కోచ్‌లు, ఏసీ కోచ్‌లు మరమ్మతులు చేపట్టడం, అందుకు అవసరమైన ఉద్యోగులు తదితర అంశాల ను చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ అంశాలపై నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైల్వే యూనియన్ నాయకులు డీఆర్ఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట రైల్వేస్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

## కాపునాడు అధ్యక్షుడికి ఘన సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఆనంద్ తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గరికపాటి చంద్రశేఖర్ నియమితులయ్యారు. బుధవారం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆయనకు ఘన సన్మానం జరిగింది. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ హాజరయ్యారు. కాపుల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా కాపులకు కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి చేయాలన్నారు. వజ్రం కిషోర్, బీజే ప్రసాద్, ఎం.పార్థసారథి, అమర్‌నాథ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతిపై వెళ్లిన అధికారికి...

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పరిపాలన అధికారిగా శ్రీకాళహస్తికి బదిలీపై వెళ్లిన గుల్షన్ బేగంను ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు విద్యానాథరెడ్డి, సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు.

## ఎంపీటీసీ మాజీ సభ్యుడికి ఎమ్మెల్సీ సిపాయి నివాళి

ఏర్పేడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవీరాపురానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోదండరామిరెడ్డి పదిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పాతవీరాపురం చేరుకుని కోదండరామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హోమియోపతి వైద్యశిబిరం

రేణిగుంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో ఉచిత హోమియోపతి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పంచాయతీ వార్డు సభ్యుడు ఎం.జీ.రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కేంద్రీయ హోమియోపతి పరిశోధన సంస్థ వైద్యులు రవిచంద్రారెడ్డి, హారతి, అవంతిక వైద్యసేవలందించారు.

## తిరుపతి చేరుకున్న సీఎం చంద్రబాబు



సీఎం బాబుకు శ్రీకాళహస్తి, నగిరి ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, భానుప్రకాష్ స్వాగతం



సీఎంకు అభివాదం చేస్తున్న ఆదిమూలం

రేణిగుంట/ శ్రీకాళహస్తి/ పిచ్చాటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడి కర్మక్రియల నిమిత్తం సీఎం విమానాశ్రయానికి చేరుకున్నారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, నగిరి, తిరుపతి, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేలు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, గాలి భాను ప్రకాష్, ఆరణి శ్రీనివాసులు, థామస్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి తదితరులు కలిశారు. సీఎం చంద్రబాబుతో విద్యా శాఖ మంత్రి లోకేశ్ కూడా వచ్చారు. ఇరువురూ రోడ్డుమార్గంలో నారావారిపల్లికి బయలుదేరి వెళ్లారు. టీటీడీ ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి కూడా సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

## అంత్యక్రియలకు వెళ్లి తిరిగివస్తూ..

- ఆటో బోల్తా, 10 మందికి గాయాలు
- తీవ్రంగా గాయపడిన ఒకరు రుయాకు తరలింపు



తీవ్రంగా గాయపడిన శంకర్‌ను రుయాకు తరలిస్తున్న దృశ్యం

పుత్తూరు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి 10 మందికి గాయాలయ్యాయి.ఈ సంఘటన బుధవారం పుత్తూరు మండలంలోని శాంతిపురం వద్ద జరిగింది. కార్వేటినగరం మండలం కేఎంపురం దళితవాడలో బంధువు మృతి చెందడంతో నారాయణవనం, పుత్తూరు నుంచి బంధువులు ఆటోలో బయలుదేరి వెళ్లారు. తిరిగి వస్తుండగా ఆవు అడ్డు రావడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పుత్తూరు మండల పరిధిలోని తిమ్మాపురానికి చెందిన శంకర్ (60) తలకు తీవ్రగాయాలయ్యాయి. నారాయణపురం మండలం బ్రాహ్మణతాంగేల్‌కు చెందిన నాగజ్యోతికి చెయ్యి విరగడం జరిగింది. క్షతగాత్రులందరినీ పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. తీవ్రంగా గాయపడిన శంకర్‌ను తిరుపతి రుయాకు తరలించారు. ఆటోడ్రైవర్ కుప్పయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిమితికి మించి 10 మంది ఆటోలో ప్రయాణించడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది.

## నేడు ప్రదోష పూజలు

పిచ్చాటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలో కొలువైన గౌరీ సమేత సోమనాథేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నందీశ్వరుడికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ, హారతి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

# చినుకు పడితే చెరువే...



శుకబ్రహ్మాశ్రమం వద్ద చెరువును తలపిస్తున్నరోడ్డు

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని శుక బ్రహ్మాశ్రమం రోడ్డు చినుకు పడితే చెరువును తలపించేలా జలమయం అవుతోంది. శుకబ్రహ్మాశ్రమం ప్రాంతంలో వందలాది నివాసగృహాలు ఉన్నాయి. అలాగే ఈ రోడ్డు మీదుగా కోనేటిమిట్ట, వాటర్‌హౌస్ కాలనీ, నందిహిల్స్ కాలనీ, తుఫాన్‌సెంటర్ ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇక ముక్కంటి ఆలయం నుంచి పాపానాయుడుపేట వరకు మధ్యలో ఉన్న గ్రామాల ప్రజలు పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డులో మడుగుల స్వామి సమాధి ప్రాంతం వద్ద రోడ్డు అత్యంత పల్లంగా మారింది. గతంలో సిమెంటురోడ్డు నిర్మాణ సమయంలో అధికారులు అనాలోచితంగా వ్యవహరించడంతో వర్షపునీరు ఇక్కడ బారీగా నిల్వ చేరిపోతోంది. చిన్నపాటి చినుకులకే రోడ్డు జలమయం అవుతోంది. భారీ వర్షాలు కురిసిన సమయంలో పెద్ద ఎత్తున నీరు నిల్వ చేరి మార్గం బురదమయంగా మారుతోంది. ఈ మార్గంలో ఏళ్ల తరబడి వెంటాడుతున్న సమస్యను అధికారులు పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళహస్తి న్యాయస్థాన 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం బాల్యవివాహాల నిర్మూలన, చట్టాలపై అవగాహన కార్యక్రమం జరి గింది. న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ బాల్యవివాహాల కట్టడికి కఠిన చట్టాలు ఉన్నాయన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండితేనే పెళ్లి చేయాలన్నారు. బాల్య వివాహాల వలన బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. బాలికలు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు మొబైల్‌ఫోన్ల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. అనంతరం మహిళలు, విద్యార్థుల చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే నెం.15100లో సంప్రదించాలని తెలిపారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు, పారా లీగల్ వలంటీర్లు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

**కేవీబీపురం:** బాల్య వివాహాలను చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని అధికారులు తెలిపారు. బుధవారం మండలంలోని అంజూరు పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుమతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

**వరదయ్యపాళెం:** మండలంలోని సాయిడిగ్రీ కళాశాలలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. భజావతి, అంగన్‌వాడీ వర్కర్ శాంతి, వరదయ్యపాళెం వర్కర్ శ్రీదేవి పాల్గొన్నారు.

**నాగలాపురం:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో బాబయ్య, జనార్దన్, తహసీల్దార్ హనుమాన్ నాయక్ పాల్గొని బాల్య వివాహ రహిత రాష్ట్ర దిశగా అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

## రుతుచక్ర సమస్యలపై విద్యార్థినులకు అవగాహన



అవగాహన సదస్సులో సూచనలిస్తున్న వైద్యులు

రేణిగుంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నమాచార్య కళాశాలలో రుతుచక్ర సమస్యలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐడబ్ల్యూఎస్ ఏపీ హెల్త్ అండ్ వెల్నెస్ పాలసీ అడ్వకేసి, హనుమాన్ కళాశాల ఐక్యూ ఏసీ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. అమరా ఆస్పత్రి వైద్యురాలు రమాదేవి, ఐడబ్ల్యూఎస్ గైనకాలజిస్టు విజయనిర్మల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదముని ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుక్తవయస్సులో అమ్మాయిలు ఎదుర్కొనే సమస్యల దానికి తగ్గటుగా జీవన యానంలో మార్పులను వివరించారు. అలాగే డైట్ కంట్రోల్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థినులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమ్య, విభాగాధిపతులు డాక్టర్ హరిత, రూపాదేవి, పుష్పలత కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్య స్వర్గ సీమ శ్రీకాళహస్తి



పార్వతి శతకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత శంకర్‌నారాయణ

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ధూర్జటి మహాకవి జన్మించిన శ్రీకాళహస్తి క్షేత్రం సాహిత్య ప్రపంచానికి స్వర్గసీమ అని ప్రముఖ హాస్య అవధాని, రచయిత డాక్టర్ శంకర్ నారాయణ అన్నారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాల వేదిక జరిగింది. ఇందులో హాస్యావధాని శంకర్‌నారాయణ రచించిన 'పార్వతిశతకం' పుస్తకాన్ని చిత్తూరు సీటమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలపతి ఆవిష్కరించారు. డాక్టర్ సాంబశివరావుకు రచయిత ఈ పుస్తకాన్ని అంకితమిచ్చారు. ఈ సందర్భంగా శంకర్‌నారాయణ మాట్లాడుతూ... ధూర్జటి మహాకవి ఆ రోజుల్లో ధైర్యంగా రాజులపైనే వ్యతిరేకంగా పద్యాలు రచించడం ఎప్పటికీ ఆదర్శనీయమన్నారు. భావితరాలకు ఆయన స్ఫూర్తి కొనసాగాలన్నారు. హైదరాబాద్‌కు చెందిన రాగరమ్య కల్చరల్ అండ్ సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు రమ్యానాయుడు, కూచిపూడి నాట్య గురువులు పద్మలత, జానకి, మాధవి పాల్గొన్నారు.

## నేడు కలిక్కం సిద్ధ వైద్య శిబిరం

వరదయ్యపాళెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లం ఏకం ప్రాంగణంలో గురువారం కలిక్కం సిద్ధ వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు సంబంధించి అరుదైన మూలికా వైద్యం అందిస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు.

## సాంఘికశాస్త్రంలో ప్రపంచ విజ్ఞానం



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

నారాయణవనం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సాంఘిక శాస్త్రంలో ప్రపంచ విజ్ఞానం ఉంటుందని ఉపాధ్యాయులు గోపి పేర్కొన్నారు. మండలంలోని పాలమంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సాంఘికశాస్త్ర స్టడీ మెటీరియల్‌ను గోపి రూపొందించారు. మెటీరియల్‌ను తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆవిష్కరించి, బుధవారం పాఠశాలలోని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మనోహరమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## లోకేశ్‌ను కలిసిన సుబ్రమణ్యంరెడ్డి



రేణిగుంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సుబ్రమణ్యంరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధికి స్కౌట్స్ అండ్ గైడ్స్ విరాళం



విజయరామరాజుకు విరాళం అందిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.35వేలను శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనానికి విచ్చేసిన రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజుకు అందజేశారు. వరదలు, ఇతర సహాయ కార్యక్రమాలకు వినియోగించే ముఖ్యమంత్రి సహాయనిధికి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బాబుఅగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇంటింటికి తిరిగి రూ.35వేలు సేకరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో కుమార్, పుత్తూరు డీవైఈవో బాలాజి, ప్రభాకర్‌రాజు, ఎంఈవో భువనేశ్వరి, జిల్లా స్కౌట్స్ కమిషనర్లు రమేష్‌బాబు, ఎం.ఎం.రెడ్డి, యూత్ ఛైర్మన్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ మేళాలో 33మంది ఎంపిక



ఉద్యోగమేళాలో ఎంపికైన వారితో అధ్యాపకులు

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం జేకేసీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరిగింది. డిక్సన్ టీబీ మార్కెటింగ్, ఎమ్మార్ఎఫ్ లిమిటెడ్ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ మేళాకు 45 మంది హాజరు కాగా అందులో 33మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఆయా సంస్థల హెచ్‌ఆర్‌లు శ్రావణ్‌కుమార్, హర్ష నియామకపత్రాలను అందజేశారు. వారిని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ నరసింహవర్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ గంగారామ్, ఎఫ్‌టీఎం గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నాగలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చంనాయుడు కండ్రిగ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు... బుధవారం సాయంత్రం చెన్నై నుంచి జిప్సం లారీ తిరుపతి మీదుగా తాడిపత్రికి వెళ్తోంది. అదే సమయంలో తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకి చెందిన అరవింద్, నరసింహులు సొంత పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లి తిరిగి తమ ఊరికి వెళ్తుండగా మార్గమధ్యంలో లారీని ఢీకొన్నారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఊత్తుకోట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరువళ్లూరు జీహెచ్‌కి పంపారు. కేసు నమోదు చేశారు.

## ముక్కంటి సేవలో రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్



శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని బుధవారం రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

## గౌడ సంఘ నూతన కార్యాలయం ప్రారంభం

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం శ్రీకాళహస్తి గౌడ సంక్షేమ సంఘ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గౌడ సంక్షేమ సంఘం యూత్ ప్రెసిడెంట్‌గా కళత్తూరు రవి కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐ.చంద్ర శేఖర్ గౌడ్, గౌరవాధ్యక్షుడు శ్రీరాములుగౌడ్, లీగల్ అడ్వైజర్ ఉదయగిరి మోహన్‌గౌడ్, అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నేడు వన భోజనాలు

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆలయ సమీపంలోని భరద్వాజ తీర్థంలో మధ్యాహ్నం 12.30గంటలకు వన భోజన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, ప్రముఖులు, పట్టణ ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## స్వర్ణ పంచాయతీ సర్వేను త్వరగా పూర్తి చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వర్ణ పంచాయతీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో త్రివిక్రమరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వేపై కార్యదర్శులతో సమీక్షించారు. మండలంలోని 28 పంచాయతీల్లో 9060 ఇళ్లను సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1390 గృహాల్లో సర్వే పూర్తైనట్టు తెలిపారు. మిగిలిన సర్వేను పూర్తి చేసి ప్రతి ఇంటి డేటాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ చొరవ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



వరదయ్యపాళెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లం పంచాయతీ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ అనాథ మృతదేహానికి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అతనికి సంబంధించిన వారి ఆచూకీ కోసం ఆరా తీశారు. అయితే తెలియపోవడంతో వరదయ్యపాళెం ఎస్ఐ మల్లికార్జున ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా దగ్గరుండి మృతదేహాన్ని ఖననం చేయించారు. అయిన వాడిలా దగ్గరుండి అంత్యక్రియలను పూర్తి చేయించారు. సాయిబాబాను పలువురుఅభినందించారు.